ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
మంగళవారం 25 జూన్ 2024

అధికారమే పెట్టుబడి..

ఐదేళ్లు దోపిడీ

- గుట్టలకు గుండు కొట్టారు
- యథేచ్ఛగా ప్రకృతి వనరుల దోపిడీ
- ఐదేళ్లు చేతులెత్తేసిన అధికారులు

సుండుపల్లె, జూన్ 24: అయిదేళ్లుగా అధికారాన్ని అడ్డు పెట్టుకొని కొండలు, గుట్టలను వైసీపీ నాయకులు కొల్లగొట్టారు. రాత్రి, పగలు తేడా లేకుండా గ్రావెల్, ఎర్రమట్టిని అక్రమంగా తరలించి లక్షలు దండుకున్నారు. ఇష్టానుసారంగా తవ్వకాలు చేపట్టి సుండుపల్లె మండలంలోని గుట్టలను కరిగించి టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా అడ్డూ అదుపు లేకుండా తరలించి సొమ్ము చేసుకున్నారు. అధికార అండతో మైనింగ్, రెవెన్యూ అధికారులను అటువైపు కన్నెత్తి కూడా చూడకుండా చేసి తమ దందా కొనసాగించారు. ఫలితంగా ప్రకృతి వనరులు విధ్వంసానికి గురయ్యాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా వైసీపీ ఐదేళ్ల పాలనలో సహజ వనరుల దోపిడీ మరింత ఎక్కువైందని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ ఆర్థిక స్వలాభం కోసం సహజ వనరులను కొల్లగొట్టి కడుపులో నింపుకున్నారని జోరుగా విమర్శలు ఉన్నాయి.

రూపురేఖలు కోల్పోయేలా తవ్వకాలు చేసి..

సుండుపల్లె మండలంలో ముట్టిమేకల గుట్ట, అక్కంపల్లి గుట్ట, రెడ్డంపల్లిగుట్ట, చిన్నగుట్ట, ఎల్లారెడ్డిగారిపల్లెగుట్ట, గుల్లావాండ్లపల్లె సమీపంలోని పలు గుట్టల నుంచి మట్టిని తరలించారు. గుట్టలను కొట్టి, చెరువులను ఖాళీ చేసి వేలాది ట్రిప్పులు తరలించారు. కొండలను ఇష్టానురీతిగా తవ్వేయడంతో ప్రస్తుతం వాటి రూపురేఖలే మారిపోయాయి. భారీ వాహనాలతో సుండుపల్లెలోని ప్రైవేటు లేఅవుట్లకు పెద్ద ఎత్తున తరలించి అయిదేళ్లలో వైసీపీ నేతలు రూ.కోట్లకు పడగలెత్తారు. ఒక్కో కొండ చుట్టూ సుమారు 200 అడుగుల ఎత్తున తవ్వేశారు. కనీసం పశుకాపరులు వాటిని మేత కోసం తోలుకోలేని విధంగా గుట్టలను ధ్వంసం చేశారు. ఏకంగా గుట్టలే లేకుండా చేసి ఆ ప్రదేశాలను వ్యవసాయ భూములుగా మార్చి కొంతమంది గుట్టలను పట్టాలు చేయించుకుని బ్యాంకులో రుణాలు పొందారు. ఇదంతా మండలంలో కొంతమంది అధికారుల చొరవనేనని టీడీపీ నాయకులు తీవ్రంగా విమర్శిస్తున్నారు.

జగనన్న కాలనీ కోసం గుట్ట మాయం

సుండుపల్లె మండల కేంద్రానికి సమీపంలోని పీలేరు ప్రధాన రహదారి పక్కన దశాబ్దాల కాలం నుంచి ఉన్న అగ్రహారం గుట్ట జగనన్న కాలనీ పేరిట మాయమైంది. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలకు ఇంటి పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వం తీసుకొచ్చిన పథకం వైసీపీలోని నాయకులకు ఆదాయ వనరుగా మారింది. మండల కేంద్రానికి వాస్తుగా పరిగణించబడే అగ్రహారం గుట్టపై అంజనేయస్వామి ఆలయం కొలువుదీరి ఉంది. అయితే ఎక్కడా ప్రభుత్వ స్థలాలు లేనట్టు పేదలకు అగ్రహారం గుట్ట (సర్వే నెంబరు 2141)ను కొట్టి పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వానికి తప్పుడు నివేదికను ఇచ్చి అధికారుల నుంచి అనుమతులు తెప్పించి గుట్టను కొల్లకొట్టారు అనే విమర్శలు ఉన్నాయి.



అగ్రహారం గుట్టను చదును చేసి జగనన్న కాలనీలో వైసీపీ నాయకులు చేపట్టిన ఇంటి నిర్మాణాలు

అయితే ఆ గుట్టను కొడితే గుట్ట దిగువ భాగంలో ఉండే ప్రభుత్వ, ప్రైవేటు భూములకు మట్టి తోలి దర్జాగా ప్లాట్లు వేసి అమ్ముకోవాలన్న సంకల్పంతో వైసీపీ నాయకులు గుట్టను కొట్టి అనుకున్నది అనుకున్నట్లుగా చేసుకున్నారు. అగ్రహారం గుట్టపై ఉన్న నివాస గృహాలను బలవంతంగా కూల్చి వారిలో 40 మందికి ఇంటి పట్టాలు ఇచ్చారు. ఆ తర్వాత ఎనిమిది ఎకరాల గుట్టలో వైసీపీ నాయకులకు, వారి అనుచరులకు మిగిలిన ప్లాట్లు లక్షల రూపాయలకు అమ్ముకుని సొమ్ము చేసుకున్నారు. ఇదంతా అధికారులకు తెలిసినా ఏమీ చేయలేకపోయారు.

ఆ గుట్ట స్థలంలో ఇప్పుడు కొన్ని జగనన్న ఇళ్లు, కొన్ని అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి. కొంతమంది గృహ ప్రవేశాలు చేశారు. సుండుపల్లె మండలంలో జరిగిన అక్రమాల్లో ఆ అగ్రహారం గుట్ట అక్రమాలు మొదటిస్థానంలో ఉంటాయని ప్రజలు చెప్పుకుంటున్నారు. అలాగే అక్కంపల్లి గుట్టను తవ్వి జగనన్న కాలనీ పేరిట పట్టాలు పంపిణీ చేశారు.



గుట్టలకు గుండు కొట్టించిన వైసీపీ నేతలు



చెరువుల్లో మట్టి అక్రమంగా తరలించడంతో ఏర్పడ్డ గుంతలు

మదనపల్లె సర్వజన బోధనాస్పత్రిలో తనిఖీలు నిర్వహిస్తున్న ఎన్ఎంసీ బృందం సభ్యులు



ఎన్ఎంసీ బృందం ఆకస్మిక తనిఖీ

- మెడికల్ కాలేజీలో అన్ని అంశాలపై పరిశీలన

మదనపల్లె టౌన్, జూన్ 24: మదనపల్లెలో నిర్మిస్తున్న ప్రభుత్వ మెడికల్ కాలేజీ భవనాలను, సర్వజన బోధనాస్పత్రిలో భవనాలు, వైద్యాధికారులు, సదుపాయాలపై ఢిల్లీ నుంచి వచ్చిన నేషనల్ మెడికల్ కమిషన్ ఆకస్మిక తనిఖీ చేసింది. సోమవారం ఉదయమే మండలంలోని ఆరోగ్యవరం సమీపంలో నిర్మిస్తున్న మెడికల్ కాలేజీ భవనాలను ఐదుగురితో కూడిన ఎన్ఎంసీ బృందం తనిఖీ చేసింది. అక్కడ తరగతి గదులు, ల్యాబ్‌లు, బాలుర, బాలికల హాస్టల్ భవనాలను పరిశీలించారు. అనంతరం మదనపల్లె సర్వజన బోధనాస్పత్రిపై నిర్మించిన అదనపు గదులు, అవుట్ పేషెంట్ విభాగంలో వైద్యుల గదులు, ఇన్‌పేషెంట్ విభాగంలో రోగులకు అందుతున్న వైద్యసేవలను పరిశీలించారు. దీంతో పాటు బోధనాస్పత్రిలో రిక్రూట్ అయిన ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, డాక్టర్ల సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేశారు. 400 పడకలకు గాను 300 పడకల్లో రోగులు ఉండటాన్ని గుర్తించారు. బయోమెట్రిక్ పద్ధతిలో వైద్యుల హాజరును పరిశీలించారు. వీటన్నింటిపై పూర్తి నివేదికను ఢిల్లీలోని ఎన్ఎంసీకి పంపుతారని, పది రోజుల్లో మదనపల్లె ప్రభుత్వ మెడికల్ కాలేజీకి 2024-25 విద్యాసంవత్సరానికి అనుమతి వస్తుందో, లేదో తెలియనుంది. కార్యక్రమంలో మెంటర్ కాలేజీ అయిన తిరుపతి ఎస్వీ మెడికల్ కాలేజ్ ప్రొఫెసర్లు డాక్టర్ కిరీటి, డాక్టర్ రమాదేవి, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ నుంచి డాక్టర్ ప్రదీప్, సర్వజన బోధనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎంఎస్ రాజు, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జమున, వైస్ ప్రిన్సిపాల్ శశికళ, బాబు, మురళీధర్, ఆర్ఎంవో ప్రసాదరాజు పాల్గొన్నారు.

సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

- కలెక్టర్ అభిషిక్త్ కిశోర్

రాయచోటి (కలెక్టరేట్), జూన్ 24: ప్రజా సమస్యల ఫిర్యాదుల వేదిక కార్యక్రమాన్ని పటిష్టంగా నిర్వహించాలని కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు. రాయచోటి కలెక్టరేట్‌లోని సమావేశం హాలులో సోమవారం ఉదయం రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం- పీజీఆర్ఎస్) కార్యక్రమానికి కలెక్టర్ శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఎస్డీసీ రామసుబ్బయ్య ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఎన్నికల అనంతరం మళ్లీ మొదలుపెట్టినట్లు తెలిపారు. ప్రతి సోమవారం జరగాల్సిన ఈ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలన్నారు. గతంలో స్పందనలో ఏవైతే ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి పెండింగ్‌లో ఉన్నాయో వాటిని ఈ కార్యక్రమానికి బదిలీ చేసినట్లు తెలిపారు. అప్పటి లాగిన్ ఐడీలతోనే ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ఆన్‌లైన్ సిస్టంలో కూడా లాగిన్ అయి ఫిర్యాదులను నాణ్యతగా పరిష్కరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంపై ప్రభుత్వం చాలా ఎక్కువ ఫోకస్ పెడుతుందని, ముఖ్యమంత్రి కార్యాలయం కూడా ఫిర్యాదుల పరిష్కారంపై నేరుగా పర్యవేక్షణ చేసే అవకాశం కూడా ఉందన్నారు. కాబట్టి అధికారులందరూ ప్రాధాన్యతగా ఫిర్యాదులను నూరు శాతం పరిష్కరించాలన్నారు. ఏవైనా తమ పరిధిలో పరిష్కారం చూపలేని వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా మండల, డివిజన్ ప్రధాన కేంద్రాల్లో క్షేత్రస్థాయిలో కూడా నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించి బాధ్యతగా ప్రజల సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ అభిషిక్త్ కిశోర్

హార్సిలీహిల్స్‌లో ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

- కుటుంబసభ్యులతో సరదాగా గడిపిన సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి సురేందర్ గుప్తా



మానస సరోవరంలో కుటుంబ సభ్యులతో కలిసి బోటింగ్ చేస్తున్న సుప్రీంకోర్టు మాజీ జస్టిస్ సురేందర్‌గుప్తా

బి.కొత్తకోట, జూన్ 24: ప్రముఖ పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌లో సుప్రీంకోర్టు పూర్వ న్యాయమూర్తి, హర్యానా రాష్ట్ర పీ రెగ్యులేటరీ కమిటీ, అప్పిలేట్ అథారిటీ సురేందర్‌గుప్తా కుటుంబ సభ్యులతో కలిసి ఉల్లాసంగా గడుపుతున్నారు. మూడురోజుల పర్యటనలో భాగంగా హార్సిలీహిల్స్‌కు విచ్చేసిన ఆయన సోమవారం కుటుంబీకులతో కలిసి కొండపై ఉన్న ప్రకృతి అందాలు, పర్యాటక ప్రదేశాలు, అటవీశాఖ ప్రాంగణంలో కలియతిరిగారు. హిల్స్‌పై ఉన్న పాత, కొత్త వ్యూపాయింట్లు, గాలిబండ, హార్సిలీ సమాధి, ఏపీ టూరిజం ఆధీనంలోని ప్రదేశాలను పరిశీలించారు. అటవీశాఖ ఆధ్వర్యంలో మానససరోవరంలో ఏర్పాటు చేసిన మానస సరోవరంలో కుటుంబ సభ్యులతో కలిసి బోటింగ్ చేశారు. వారి వెంట అటవీ శాఖ సెక్షన్ ఆఫీసర్ శివకుమార్, రెవిన్యూ అధికారులు ఉన్నారు.

సీఎం కుర్చీలో ఉన్నప్పుడు.. పులివెందుల ప్రజలు కనిపించలేదా?

- ఐదేళ్లలో పట్టుమని మూడు రోజులు కూడా గడపని జగన్
- పదవి పోతూనే పులివెందుల గుర్తొచ్చిందా..
- లేదా అవినాశ్ చేతుల్లోకి పులివెందుల వెళ్లిందని తేరుకున్నారా
- మాజీ సీఎం జగన్ పర్యటనపై పులివెందుల ప్రజల మనోగతం

కడప, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): జగన్ మాజీ సీఎం అయ్యాక పులివెందులలో మూడు రోజుల పర్యటనకు శనివారం వచ్చారు. అదికూడా పులివెందులలోని తన ఇంటి ముందు ఉన్న సొంత కార్యాలయంలో గడపడం అందరికీ ఒకింత ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. 2019లో ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసినప్పటి నుంచి వరుసగా మూడురోజుల పాటు ఒక్కసారి కూడా పులివెందులలో గడపని జగన్.. అధికారం పోతూనే రావడంతో పులి వెందుల ప్రజలే విస్మయానికి గురవుతున్నారు. ఘోర ఓటమి చవిచూసి దానిని జీర్ణించుకోలేక తాడేపల్లెలో ఉండలేక సొంత ఊరిలో మూడు రోజులు కార్యకర్తలు, నాయకులతో గడుపుదామని వచ్చినట్లు తెలిసింది. కాగా అప్పటికే పులి వెందుల ప్రజల్లో జగన్ మీద కొంత అసహనం, వ్యతిరేకత చోటుచేసుకున్నాయి. ఇందుకు కారణం కూడా లేకపోలేదు. ముఖ్యమంత్రిగా ఉన్నన్ని రోజులు పులివెందులలో ఏ నాయకుడూ ఆయనను స్వయంగా వెళ్లి కలిసేందుకు అవకాశమే ఇవ్వలేదు. కేవలం కడప ఎంపీ అవినాశ్‌రెడ్డి ఆశీస్సులు ఉంటేనే జగన్ అపాయింట్‌మెంట్ దొరికేది. ఈ విషయాన్ని బహిరంగంగానే చెప్పుకొనేవారు.



పులివెందులలో వైసీపీ ప్రజాప్రతినిధులు, నేతలతో మాట్లాడుతున్న జగన్

పులివెందుల చేయి దాటిపోయిందా..

పులివెందుల నియోజకవర్గం పూర్తిగా వైఎస్ కుటుంబం నుంచి అవినాశ్ కుటుంబం చేతిలోకి వెళ్లిందన్నది నగ్నసత్యం. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, వైఎస్ వివేకానందరెడ్డి, చివరకు జగన్‌కు సంబంధించిన వర్గం పులివెందులలో లేకపోవడం విశేషం. కాంట్రాక్టుల విషయానికి వచ్చినా, ఏదైన పదవి ఇవ్వాలన్నా అవినాశ్ ఆశీర్వాదం ఉంటేనే సాధ్యమయ్యేది. పులివెందులలో అవినాశ్ కుటుంబం చేరదీసిన నాయకుల విషయానికి వస్తే అటు ప్రజల్లో పలుకుబడి గాని, ఇటు రాజకీయ కుటుంబాలకు సంబంధించిన వారికి గానీ అక్కడ ప్రాధాన్యత ఉండదు. అంతా తనచుట్టూ తిరుగుతూ తన ఇంటి వద్ద రోజూ క్రమం తప్పకుండా హాజరు వేయించుకునే గల్లీ నాయకులకే వారు పట్టం కట్టారు. దీని కారణంగానే మొన్న పులివెందులలో మెజార్టీ తగ్గిందని అక్కడి ప్రజలు చెబుతున్నారు. జగన్ పులివెందులకు వచ్చి మూడు రోజులు గడపడం.. అవినాశ్ ముందే నాయకులు ఆక్రోశం వెళ్లగక్కడం తెలిసిందే. దీనితో పులివెందుల పరిస్థితి ఏమిటో జగన్‌కు అర్థం అయి ఉంటుందని అంటున్నారు. పూర్తిగా కడపను, పులివెందుల నియోజకవర్గాన్ని అవినాశ్ చేతుల్లో పెట్టడం సరైంది కాదేమోనని జగన్ ఆలోచనలో పడ్డట్లు తెలుస్తోంది.

ఓదార్పు కోసం వస్తే..

ఘోర ఓటమి చవిచూసిన జగన్.. తనకు పులివెందుల ప్రజల నుంచి ఓదార్పు లభిస్తుందనుకుంటే నిరసనలు ఎదురవడం ఊహించని పరిణామం. ముందుగా ఐదు రోజుల పర్యటన అని.. అదో వస్తున్నారు, ఇదో వస్తున్నారని వైసీపీ నేతలు చెబుతూ వచ్చారు. చివరకు ఇక్కడి ప్రజల తీరుతో ఐదు రోజుల పర్యటన కాస్తా మూడు రోజులకే పరిమితం అయింది. పాడా నిధులతో అభివృద్ధి పనులు చేపట్టి బిల్లులు చెల్లించకపోవడం, బిల్లులు రాకపోవడం, అవినాశ్ కుటుంబం వ్యవహరించిన తీరు అన్నీ కలిపి జగన్ ముందు బాధితులు ఏకరువు పెట్టారు. ఇదెక్కడి తలనొప్పిరా బాబూ అనుకుని జగన్ మూడు రోజులకే బయలుదేరి హెలికాప్టర్ ద్వారా కుటుంబ సమేతంగా బెంగళూరు వెళ్లిపోయారు. ఏది ఏమైనా పులివెందులలో ఇలాంటి పరిణామం ఎదురవుతుందని జగన్ కలలో కూడా ఊహించి ఉండరు.

ఎరువుల దుకాణంపై విజిలెన్స్ దాడులు

- రూ.9 లక్షల విలువైన ఎరువులు, విత్తనాలు సీజ్

గుర్రంకొండ, జూన్ 24: గుర్రంకొండ పట్టణంలో ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేసి రూ.9 లక్షల విలువ గల ఎరువులు, పురుగు మందులు, విత్తనాలను సీజ్ చేశారు. కడప విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల ఆదేశాల మేరకు సోమవారం గుర్రంకొండలో ఎరువుల దుకాణాలను సీఐ ఇదురుబాష స్థానిక వ్యవసాయ శాఖాధికారులతో కలిసి దాడులు చేశారు. ఈ దాడుల్లో ఓ ఎరువుల దుకాణంలో స్టాక్ రికార్డుల్లో తేడాలను గమనించారు. ఈ క్రమంలో దుకాణంలోని విక్రయానికి సిద్ధంగా ఉన్న రూ.8,29,100 విలువ గల 27 టన్నుల ఎరువుల బస్తాలు, రూ.63,882 విలువ గల 3.9 కిలోల విత్తనాలు, రూ.34 వేల విలువ గల 20 లీటర్ల పురుగుల మందులను సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు. సీజ్ చేసిన పురుగుల మందు, ఎరువులు, విత్తనాలను విక్రయించరాదని దుకాణదారుడికి తెలిపారు. ప్రభుత్వ నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని తెలిపారు. పట్టణంలో విజిలెన్స్ దాడులు జరుగుతున్నట్లు తెలియడంతో మిగిలిన ఎరువుల దుకాణాలు ఉదయం నుంచి సాయంత్రం వరకు మూసేయడం కొసమెరుపు. అధికారులు మిగిలిన ఎరువుల దుకాణాలను కూడా తనిఖీ చేసి న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు. దాడుల్లో వ్యవసాయశాఖాధికారి బాలగంగాధర్‌రెడ్డి, ఏజీ శ్రీనివాసులు, ఎఫ్ఆర్వో మురళీకృష్ణ, డీసీటీవో బాబుమోజస్, గుర్రంకొండ ఏవో నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.



ఎరువుల దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

గుర్రంకొండ పోలీస్‌స్టేషన్‌లో ఉద్రిక్తత

- పోలీసులపై దాడి చేశారని ఆరుగురిపై కేసు నమోదు

గుర్రంకొండ, జూన్ 24: గుర్రంకొండ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం రాత్రి ఉద్రిక్త వాతావరణం నెలకొంది. మండలంలోని అమిలేపల్లె గ్రామంలో వైసీపీ, టీడీపీ నాయకులకు మధ్య పాత కక్షలున్నాయి. ఇందులో భాగంగా ఓ కేసు విషయంలో వైసీపీ నాయకులను పోలీసులు స్టేషన్‌కు పిలిపించారు. పోలీసులు వైసీపీ నాయకులకు విలువ ఇస్తున్నారంటూ టీడీపీకి చెందిన కొందరు నాయకులు వాదించారు. ఈ క్రమంలో వైసీపీ, టీడీపీ నాయకులకు మధ్య వాగ్వాదం జరిగింది. ఇరువర్గాలు గొడవ పడకుండా ముందస్తుగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులకు టీడీపీ నాయకులకు మధ్య తోపులాట జరిగింది. ఈ తోపులాటలో స్టేషన్‌లో పనిచేస్తున్న ఎస్ఐ-2 శ్రీనివాసులనాయక్, హెచ్‌సీ వేణుగోపాల్‌పై దాడికి యత్నించినట్లు ఎస్ఐ-2 శ్రీనివాసులనాయక్ తెలిపారు. దీంతో పోలీస్‌స్టేషన్‌లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. తమపై దాడికి యత్నించిన అమిలేపల్లెకు చెందిన ప్రకాశ్, వెంకటేష్, మహేంద్రరెడ్డి, ద్వారక, సాగర్, రామకృష్ణలపై కేసు నమోదు చేయాలని ఎస్ఐ, హెచ్‌సీలు వాల్మీకిపురం సీఐ పులిశేఖర్‌కు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ ఫిర్యాదు మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఓటు వేయలేదని.. వాటర్ స్కీం ట్యాంకుల తొలగింపు

- వైసీపీ నాయకుల దాష్టీకం..
- ఇబ్బందుల్లో ప్రజలు



వైసీపీ నాయకులు ట్యాంకులు తీసుకెళ్లడంతో ఖాళీగా ఉన్న సిమెంటు దిమ్మె

(రాయచోటి- ఆంధ్రజ్యోతి): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆగడాలు ప్రభుత్వం మారినా ఆగడం లేదు. ఐదు సంవత్సరాల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కబంధ హస్తాల నుంచి ప్రజలు బయటపడినా.. ఇంకా ఏదో విధంగా ప్రజలను ఇబ్బందులకు గురి చేయాలనే చూస్తున్నారు. మాకు ఓట్లు వేయలేదంటూ ప్రజలకు కనీసం తాగునీళ్లు అందకుండా చేస్తున్నారు. ఈ విషయం అధికారులకు చెప్పినా ఎవరూ పట్టించుకోకపోవడం విశేషం. వీరబల్లి మండలం తాటిగుంటపల్లె పంచాయతీ శికారిపాలెంలో వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో సుమారు 5 లక్షల రూపాయల వ్యయంతో గ్రామంలో వాటర్‌స్కీంను ఏర్పాటు చేశారు. పైపులైన్లు, ట్యాంకులు (డ్రమ్ము)లను ఏర్పాటు చేశారు. ప్రజలు ఈ వాటర్‌స్కీం ద్వారా నీళ్లు పట్టుకుంటుండేవారు. అయితే ఈ ఊరి ప్రజలకు సార్వత్రిక ఎన్నికల రూపంలో వైసీపీ నాయకుల నుంచి పెద్ద ఇబ్బందే వచ్చింది. ఈనెల 4న ఎన్నికల ఓట్ల లెక్కింపు జరిగిన తర్వాత అదే గ్రామానికి చెందిన ఇద్దరు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఊర్లోకి వచ్చి డ్రమ్ములను పట్టుకెళ్లారు. మీరు మాకు ఓట్లు వేయలేదు. రాజంపేటలో మా పార్టీ ఎమ్మెల్యే గెలిచాడు. మా ప్రభుత్వంలో వేసిన వాటర్‌స్కీం ఇది మీకు సంబంధం లేదని అక్కడి నుంచి తీసుకెళ్లి వారి ఇళ్లలో పెట్టుకున్నారు. ట్యాంకులు తీసేయడంతో ట్యాంకులను పెట్టి ఉన్న దిమ్మెలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. దీంతో నీళ్లకు ఇబ్బందులు పడ్డ స్థానికులు ఎంపీడీవో, గ్రామ పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేసిన ట్యాంకులు కాబట్టి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుల ఇళ్లలో ఉన్న ట్యాంకులను తీసుకువచ్చి తిరిగి అక్కడే పెట్టాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు ఆ ట్యాంకులకు మోక్షం కలగలేదు. ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వైసీపీ నాయకుల ఇళ్లలో ఉన్న ట్యాంకులను తెచ్చి వాటర్‌స్కీంకు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



ట్యాంకు లేని సిమెంటు దిమ్మె

ఆశల.. సాగులో..!

- వరుణుడు కరుణించేనా!
- ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్న రైతులు
- దుక్కులు దున్నుతూ.. ఎరువులు చల్లుతూ

ముమ్మరంగా సేద్యపు పనుల్లో నిమగ్నం

పోరుమామిళ్ల/మైలవరం, జూన్ 24: మండలంలో గత ఖరీఫ్ సీజన్‌లో 4902 ఎకరాల్లో వరి, సజ్జ, మొక్కజొన్న, పత్తి తదితర పంటలను సాగు చేశారు. ఈ సారి వర్షాలు సకాలంలో కురిస్తే ఈ విస్తీర్ణం పెరిగే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు అంటున్నారు. కానీ ఇప్పటి వరకు సరైన వర్షాలు కురిసిన దాఖలాలు లేవు. గత ఏడాది ఈ సీజన్‌కు బ్రహ్మసాగర్ ప్రాజెక్టులో నీరు ఉండడంతో ఆ నీటిని చెరువులకు మళ్లించడంతో చెరువుకింద ఆయకట్టు అనుకుని ఉన్న పొలాలన్నీ పంటలు వేశారు. కానీ ఈ సారి ఆ పరిస్థితి లేకుండా పోయింది. ఇప్పటి వరకు బ్రహ్మంసాగర్‌లో సరిపోయేంత నీరు లేకపోవడంతో పోరు మామిళ్ల చెరువుకు నీరు ప్రస్తుతానికి వచ్చే పరిస్థితి లేదు. ప్రస్తుతం చెరువుల్లో కూడా చుక్క నీరు లేకపోవడంతో రైతులంతా వరుణదేవుడు కోసం ఎదురు చూస్తున్నారు. పోరుమామిళ్ల చెరువుకు సంబం ధించి సాధారణ విస్తీర్ణం 4వేల ఎకరాలు ఉన్నా అనధికారికంగా పది వేల ఎకరాలు విస్తీర్ణం గల పొలాలున్నాయి. ప్రస్తుతం పోరుమామిళ్ల చెరువుకట్ట, మల్లకతవ కింద పొలాలన్నీ బీడు గానే ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో దాదాపు 2వేల వరకు వ్యవసాయ బోర్లు ఉన్నాయి. వీటినే ఆధారంగా చేసుకుని రైతులు తమ తమ ప్రాంతాల్లో పంటలు వేసేం దుకు సిద్ధమవుతున్నారు. వ్యవసాయ బోర్లు లేని రైతులు మాత్రం వరుణుడి కోసం ఎదురు చూస్తున్నారు.

మైలవరం మండలంలో 10వేల హెక్టార్లు సాధారణ విస్తీర్ణం కాగా ఈ ఖరీఫ్‌లో దాదాపు 2 వేల హెక్టరులలో సాగు చేయడానికి రైతులు సమాయత్తం అవుతున్నారు. గ్రామాల్లోని రైతులు రేగడి నేలల్లో సేద్యాలు చేయడం, ఎరువులను చల్లడం తదితర పనుల్లో నిమగ్నమయ్యారు. ఎక్కువగా తొర్రివేముల, కల్లుట్ల, తల మంచిపట్నం, వద్దిరాల, మైలవరం, చిన్నకొమెర్ల, పొన్నంపల్లి తదితర పంచాయతీ లలో 11 వందల హెక్టార్లలో మిరపసాగు, దాదాపు మూడు వందల హెక్టార్లలో పత్తి పంట సాగు చేసే అవకాశం ఉంది.

ఖరీఫ్‌లో అధి కంగా మండలంలో మిరప, పత్తి, జొన్న సాగు చేస్తారు. నార్జాంపల్లె, మైలవరం, తొర్రివేముల, చిన్నకొమెర్ల, దొమ్మర నంద్యాల, వేపరాల జలాశయం నుంచి కాలువ ద్వారా నీరు వచ్చే అవకాశం ఉండడంతో సాగుకు సమాయత్తం అవుతున్నారు. వారం పదిరోజుల్లో ఎప్పుడైనా వర్షం వస్తే విత్తనాలు నాటడం మొదలు పెట్టే అవకాశం ఉంది. లేదంటే బోరు బావుల ద్వారా వచ్చే నీటితో విత్తనాలు నాటేందుకు సిద్ధమవుతున్నారు.

ఎద్దుల బండితో పొలంలో ఎరువు తోలుతున్న రైతన్న



ట్రాక్టర్‌తో సేద్యపు పనులు చేస్తూ..





రైతన్నలు కోటి ఆశలతో ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే సీజన్ ప్రారంభం కావడంతో ముమ్మరంగా సేద్యపు పనులు చేస్తు న్నారు. దుక్కులు దున్నడం, ఎరువుల చల్లడం తదితర పనుల్లో నిమ గ్నమయ్యారు. గత ఏడాది తీవ్ర వర్షాభావం నెలకొనడంతో చాలా వరకు భూములు బీడుగా మారాయి. అక్కడక్కడ అరకొర వర్షాలకు సాగు చేసిన పంటలు దెబ్బతిని తీవ్రంగా నష్టపోయారు. ఈ ఏడాది అయినా వరుణదేవుడు కరుణించి సకాలంలో వర్షాలు కురిసి పంటలు పండుతాయనే ఆశలతో అన్నదాతలు ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతు న్నారు. అయితే సీజన్ ప్రారంభమై రోజులు గడుస్తున్నా సరైన వర్షం లేక వరుణుడి కరుణ కోసం ఎదురు చూపులు చూస్తు న్నారు. కాగా, వ్యవసాయ బోర్లు ఉన్న రైతులు మాత్రం బోర్ల కింద పంటలు సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు.



వ్యవసాయ బోర్ల కింద సాగుకు సిద్ధంగా...

వర్షం వస్తే.. వరి సాగు చేస్తాం

వ్యవసాయ బోర్ల కింద పంటలు సాగు చేశాం. వర్షాలు సకాలంలో కురవకపోవడంతో బోర్లనే నమ్ముకుని మొక్కజొన్న పంట సాగు చేశాం. వర్షాలు సకాలంలో కురిసి చెరువుకు సమృద్ధిగా నీరు చేరితే వరి పైరు సాగు చేస్తాం.

- సుబ్బరాయుడు, సుంకేసులపల్లె



దుక్కి దున్ని సిద్ధం చేశాం..

పొలాలు దుక్కి దున్ని వరి నాట్లకు సిద్ధం చేసుకు న్నాం. సకాలంలో వర్షాలు కురిస్తే వరి పైరు వేసు కునేందుకు సిద్ధంగా ఉన్నాం. వరుణ దేవుడు ఎప్పుడు కనికరిస్తాడో అని ఎదురు చూస్తున్నాం.

- యనమల సుబ్బరాయుడు, బలిజకోట

ఫిర్యాదులపై సత్వరం స్పందించాలి : ఎస్పీ

కడప (క్రైం), జూన్ 24: జిల్లాలో బాధితులు పోలీసుశాఖకు ఇచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరం స్పందించి న్యాయం చేయాలని ఎస్పీ సిద్ధార్థ కౌశల్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని పెన్నార్ పోలీసు కాన్ఫరెన్స్ హాలు లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టమ్) కార్యక్రమంలో ఎస్పీ స్వయంగా బాధితులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఫిర్యాదులకు అత్యధిక ప్రాధాన్యతనివ్వాలని, నిర్ణీత సమయంలో వాటిని పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. సైబర్ క్రైం బారిన పడ్డ బాధితుల ఫిర్యాదు మేరకు సంబంధిత పోలీసు అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టాలన్నారు. సైబర్ నేరాల పట్ల ప్రజ లు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. ప్రజలకు సైబర్ క్రైంకు సంబం ధించి ఎలాంటి సమస్య ఉన్నా ఆన్‌లైన్ వెబ్‌సైట్ డబ్ల్యు.డబ్ల్యు.డబ్ల్యు.సైబర్‌క్రైం.గొ.ఇన్ ద్వారా నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్(ఎన్‌సీఆర్‌పీ)లో మరియు టోల్‌ఫ్రీ నెం.1930కు ఫిర్యాదు చేయవచ్చని ప్రజలకు ఎస్పీ సూచించారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ సిద్ధార్థ కౌశల్

పీహెచ్‌డీ ప్రవేశాల ఇంటర్వ్యూలు ప్రారంభం

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 24 : ఏపీఆర్ సెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులకు పీహెచ్‌డీ ప్రవేశాల ప్రక్రియ రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం ప్రారంభమైంది. అందులో భాగంగా కడప వైవీయూలో తొలిరోజు ఫైన్‌ఆర్ట్స్, మెటీరియల్ సైన్స్ అండ్ నానో టెక్నాలజీ సబ్జెక్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ యూనివర్శిటీల నుంచి సబ్జెక్టు ఎక్స్‌పర్ట్‌ను ఆహ్వానించి ఇంటర్వ్యూలు సాగిస్తున్నారు. ఈ సందర్భంగా వైవీయూ ప్రవేశాల సంచాలకులు డాక్టర్ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు చింతా ప్రసాద్ మార్గదర్శకాల మేరకు ఇంటర్వ్యూలకు ఏర్పాట్లు పూర్తి చేసి నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 25న మేథమేటిక్స్ పొలిటికల్ సైన్స్ సబ్జెక్టులకు 26న మేథమేటిక్స్ 27న సైకాలజీ సబ్జెక్టులకు ఇంర్వ్యూలు జరుగుతాయన్నారు. రీసెర్చ్ ప్రపోజల్‌తో పాటు అన్ని రకాల అర్హత పత్రాలతో ఆయా తేదీల్లో ఉదయం 10గంటలకు హాజరు కావాలని సూచించారు. సైకాలజీ, మేథమేటిక్స్ సబ్జెక్టుల వారు యూనివర్శిటీ ప్రాంగణంలోని డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్‌లో హాజరు కావాలని పొలిటికల్ సైన్స్ విద్యార్థులు ఆర్ట్స్‌బ్లాకులో హాజరు కావాలన్నారు.

జాతీయ లోక్‌అదాలత్‌ను వినియోగించుకోవాలి

- జిల్లా ప్రధాన జడ్జి శ్రీదేవి

కడప(రూరల్) జూన్ 24: జాతీయ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థల ఆదేశాల మేరకు జూన్ 29న శనివారం ఉదయం నిర్వహిస్తున్న జాతీయ లోక్‌అదాలత్‌ను కక్షిదారులు, న్యాయవాదులు, సంబంధితశాఖల అధికారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన జడ్జి శ్రీదేవి పేర్కొన్నా రు. లోక్ అదాలతలో ఒక సారి కేసు పరిష్కాం అయితే తిరిగి అపీల్ చేసుకోవడానికి వీలుపడదని సుప్రీంకోర్టు తీర్పుతో సమానంగా ఉంటుందన్నారు. ఇక్కడ కేసులు పరి ష్కారం చేయడం వలన డబ్బు, సమయం ఆదా అవుతుందన్నారు. వ్యక్తిగత సంబంధాలు చెడ వన్నారు. ఇలాంటి ప్రయోజనాలు ఉన్న లోక్ అదాలత్‌ను ప్రతి ఒక్కరు పూర్తి స్థాయిలో వినియోగించుకుని అధిక కేసుల పరిష్కారానికి తోడ్పడాలన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

మైలవరం, జూన్ 24: మండల పరిధి లోని చిన్నకొమెర్ల గ్రామానికి చెందిన కర్నాటి అశ్వర్థరెడ్డి గారి గోపాల్‌రెడ్డి (60) అనే రైతు అప్పుల బాధ తాళలేక పురుగుల మందు తాగి మృతి చెందినట్లు తలమంచిపట్నం ఎస్‌ఐ హనుమంతు తెలిపారు. గోపాల్‌రెడ్డికి తనకున్న ఐదు ఎకరాల పొలంలో పంటలు సాగు చేశాడు. పంటల సాగు కోసం పలువురి వద్ద అప్పులు చేశాడు. పంటలు సక్రమంగా పండక నష్టాలు రావడం.. ఆరోగ్యం కూడా బాగా లేకపోవడంతో అప్పులు తీర్చ లేమన్న మనస్తాపంతో సోమవారం ఇంట్లోనే పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు వెంటనే జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. గోపాల్‌రెడ్డి కుమారుడు గురివిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



గోపాల్‌రెడ్డి మృతదేహం

యువకుడిని కాపాడిన పోలీసులు

కడప (ఎన్టీఆర్ సర్కిల్), జూన్ 24: మండలంలోని ఆదినిమ్మాయపల్లె డ్యామ్ వద్ద సోమవారం నీటిలో కొట్టుకుపోతున్న యువకుడిని వల్లూరు పోలీసులు కాపాడారు. పోలీసుల వివరాల మేరకు.. పెండ్లిమర్రి మండలం మాచునూరుకు చెందిన చంద్ర అనే యువకుడు నదిలో కొట్టుకుపోవడాన్ని చూసి స్థానికులు కేకలు వేశారు. ఇంతలో అక్కడకు రౌండ్స్‌కు వచ్చిన ఎస్‌ఐ కత్తి వెంకటరమణ, సిబ్బంది గమనించి తాళ్ల సాయంతో యువకుడిని రక్షించి ఒడ్డుకు చేర్చారు. దీంతో స్థానికులు పోలీసుల సమయస్ఫూర్తిని కొనియాడారు.



అదుపు తప్పిన లారీ... తప్పిన ప్రమాదం

సికెదిన్నె, జూన్ 24: కడప-రాయచోటి జాతీయ రహదారిలోని గువ్వల చెరువు ఘాట్‌లో లారీ అదుపు తప్పిన ఘటనలో త్రుటిలో పెద్ద ప్రమాదం తప్పింది. రాయచోటివైపు నుంచి కడపకు వస్తున్న లారీ గువ్వల చెరువు ఘాట్ మీదుగా వెళుతూ అదుపు తప్పింది. దీంతో డ్రైవర్ నెమ్మదిగా నడుపుతూ నాలుగవ మలుపు వద్ద మట్టికుప్ప ఎక్కించాడు. దీంతో లారీ ముందు టైర్లు మట్టికుప్పపైకి ఎక్కి ఆగిపోవంతో పెద్ద ప్రమాదం తప్పింది. లారీ వేగంగా వచ్చి ఉంటే దాదాపు వంద అడుగుల లోయలో పడి పెద్ద ప్రమాదం జరిగేది. డ్రైవర్ ఎంతో చాకచక్యంగా వాహనాన్ని అదుపుచేయడంతో ప్రమాదంలో ఎవరికి ఎటువంటి గాయాలు కాలేదని తెలిసింది.



రైల్వే సామగ్రి చోరీ చేసిన వ్యక్తి అదుపులోకి..

కడప (ఎడ్యుకేషన్), జూన్ 24: రైల్వే సామగ్రి చోరీకి పాల్పడిన వ్యక్తిని కడప రైల్వేస్టేషన్‌లో సోమవారం ఆర్‌పీఎఫ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు ఆర్పీఎఫ్ సీఐ శ్రీనివాసులు తెలిపారు. కడప రైల్వేయార్డులో ఉన్న రైల్వే సామగ్రిని దేవునికడపకు చెందిన శివమణికంఠ చోరీ చేసి వెళుతుండగా ఆర్పీఎఫ్ పోలీసులు గుర్తించి అతన్ని అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. రైల్వే సామగ్రిని చోరీ చేయడం పెద్ద నేరమని. చోరీకి పాల్పడ్డ శివమణికంఠను గుంతకల్లు రైల్వేకోర్టులో మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచనున్నట్లు తెలిపారు. నిందితుడిని పట్టుకున్న వారిలో ఆర్పీఎఫ్‌సీఐతో పాటు హెడ్‌కానిస్టేబుళ్లు ప్రభాకర్‌రెడ్డి, రామచంద్ర, కానిస్టేబుల్ పోతు రాజు తదితరులు ఉన్నారు.

ఐదు ఎర్రచందనం దుంగలు స్వాధీనం



స్మగ్లర్లు, పట్టుబడ్డ దుంగలతో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది

రాజంపేట, జూన్ 24: రాజంపేట అటవీ పరిధిలోని తుమ్మలబైలు అటవీ ప్రాంతంలో ఐదు ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకుని, ఇరువురు స్మగ్లర్లను అరెస్ట్ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ చెంచుబాబు తెలిపారు. ఆర్ఎస్ఐ టి.రాఘవేంద్ర ఆధ్వర్యంలో కూంబింగ్ నిర్వహిస్తుండగా కొందరు వ్యక్తులు ఎర్రచందనం దుంగలను మోసుకుంటూ వెళుతూ కనిపించారన్నారు. వారిని చుట్టుముట్టగా ఇద్దరు స్మగ్లర్లు దొరికారన్నారు. తమిళనాడు రాష్ట్రం ఏలూరు జిల్లా అనైకట్టు గ్రామానికి చెందిన పొన్నుస్వామిరాజ్, ప్రభు వెల్లియన్‌లను అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచామన్నారు.

దేవుడి ముసుగులో కబ్జాకు యత్నం

బద్వేలు రూరల్, జూన్ 24: మండల పరిధిలోని బయనపల్లె గ్రామ సమీపంలో చెరువు స్థలాన్ని దేవుడి ముసుగులో కొందరు కబ్జా చేసేందుకు యత్నించగా.. మరో వర్గం వారు అడ్డుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వివరాలిలా.. బయనపల్లె గ్రామ సమీపంలోని చెరువు ప్రాంతాన్ని గ్రామస్థులు శ్మశాన వాటికగా వాడుకుంటున్నారు. చెరువు నీటితో నిండిన సమయంలో రోడ్డుపైనే ప్రధాన రహదారిపైనే దహన సంస్కారాలు చేసిన సంఘటనలు అనేకం ఉన్నాయి. అయితే బయనపల్లె సత్రంకు సంబంధించిన ఓ వ్యక్తి చర్చి నిర్మాణం చేపడతామంటూ ఆ స్థలంలో ఓ శిలువ నాటి కబ్జా చేసేందుకు ప్రయత్నించగా బయనపల్లె గ్రామస్థులు వెళ్లి అడ్డుకున్నారు. దీంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. స్థలం కబ్జా చేసేందుకు ప్రయత్నించిన వ్యక్తి గతంలో సంచలనం రేకెత్తించిన నకిలీ తయారీ పట్టా కేసుల్లో ప్రధాన నిందితుడు కావడం గమనార్హం. అయితే ఈ ఘటనకు టీడీపీ నాయకులతో సంబంధాలు ఉన్నాయంటూ ఓ వర్గం ప్రచారం చేయగా, వైసీపీ నాయకులు అండగా ఉన్నారంటూ మరో వర్గం ప్రచారానికి తెర లేపింది. అయితే స్థాని క రెవెన్యూ అధికారులు చెరువు స్థలాన్ని ఎవరు ఆక్రమించినా చర్యలు చేపడతామంటూ హెచ్చరిక బోర్డులు స్థలంలో పాతారు. పోలీసులు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా కాపు కాస్తున్నారు.

కబ్జాకు ప్రయత్నించిన చెరువు స్థలం ఇదే



స్నేహితుడి కుటుంబానికి అండగా...

పులివెందుల రూరల్, జూన్ 24: పులివెందులలో 1997-2000లో లయోలా డిగ్రీ కళాశాలలో బి.కామ్ బ్యాచ్ విద్యార్థులు వారంతా.. ఆ బ్యాచ్‌లో తొండూరు మండలం మల్లేలకు చెందిన ఎస్.కే.హుస్సేన్ అలాం ఒకరు. ఈయన 2007లో పనికి వెళ్లి విద్యుదాఘాతానికి గురై మరణించారు. హుస్సేన్ మరణవార్త విన్న సహచరులందరూ చలించిపోయారు. స్నేహితుడి కుటుంబానికి అండగా నిలవాలని నిర్ణయించుకున్నారు.

సోమవారం స్నేహితుడి మొదటి కుమార్తె వివాహానికి హాజరయ్యారు. వీరిని చూసిన హుస్సేన్ అలాం కుటుంబ సభ్యులు కన్నీటిపర్యంతమయ్యారు. కాగా, అలాం స్నేహితులం దరూ అప్పట్లో నిర్ణయించుకున్న మేరకు అతని కుటుంబానికి రూ.1,44,500 సాయం చేశారు. వీరు స్నేహబంధానికి ఇచ్చిన విలువలను చూసి వివాహానికి హాజరైన పలువురు అభినందించారు.



ఎస్.కే.హుస్సేన్ కుమార్తె వివాహానికి హాజరైన అతని స్నేహితులు

కారు ఢీ... వ్యక్తికి తీవ్రగాయాలు

రామాపురం, జూన్ 24: కర్నూలు- చిత్తూరు 40వ జాతీయ రహదారిలోని గువ్వలచెరువు వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రెడ్డినాయక్ అనే వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. గువ్వలచెరువు గ్రామానికి చెందిన బుక్కే రెడ్డినాయక్ గ్రామ సచివాలయంలో పనిచేస్తున్నాడు. రోడ్డు దాటుతుండగా కడప వైపు నుంచి రాయచోటి వైపు వెళ్తున్న కారు ఢీకొనడంతో రెడ్డినాయక్‌కు తలపై తీవ్ర రక్తగాయాలయ్యాయి. సంఘటనా స్థలానికి రామాపురం పోలీసులు చేరుకొని గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వీఎల్ ప్రసాద్‌రెడ్డి తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

కడప (క్రైం), జూన్ 24: మండలంలోని చెరువుకిందపల్లెకు చెందిన కుంచెం అనంతరెడ్డి (30) రెండు రోజుల నుంచి కనిపించడంలేదని, కడపకు వచ్చి ఆర్టీసీ బస్టాండు సమీపంలో ఓ హోటల్‌కు వచ్చి స్నేహితులతో కలిసి తిరిగి వైజంక్షన్‌లో కోచింగ్ సెంటరుకు వెళ్లి తిరిగి రాలేదు. ఈ సంఘటనపై అతని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం రాత్రి కేసు నమోదు చేసినట్లు చిన్నచౌకు ఎస్‌ఐ మహ్మద్ రఫీ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు చిన్నచౌకు సీఐ సెల్:9121100520, ఎస్‌ఐ 9121100521, 9121100522 లలో సంప్రదించాలని తెలిపారు.



కుంచెం అనంతరెడ్డి

జగన్ విలాస భవనాలపై విచారణ జరపాలి : డీఎల్

ఖాజీపేట, జూన్ 24: మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జిల్లాకు ఒక విలాసవంతమైన భవనాన్ని, పార్టీ కార్యాలయాలు నిర్మించుకున్నారని మాజీ మంత్రి డీఎల్ రవీంద్రారెడ్డి అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 'ఆంధ్రజ్యోతి' పేపర్ చూపించి రాష్ట్రంలో ఇన్ని విలాసవంతమైన భవనాలు జగన్ ఏర్పాటు చేసుకుంటున్నారని అన్నారు. ఈ విలాసవంతమైన భవనాలను ప్రభుత్వ భూముల్లో నిర్మించుకోవడం చూస్తే ఆయన అక్రమాలకు అడ్డూ అదుపు లేకుండా పోయిందన్నారు. ఇలాంటి భవనాలపై ప్రస్తుత ప్రభుత్వం విచారణ చేపడితే మరిన్ని బయట పడే అవకాశం ఉందన్నారు. ఇలాంటి తప్పిదాలు మరొకరు చేయకుండా, ప్రజాధనం దుర్వినియోగం కాకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

అధికారులు జగన్‌ను ఆదర్శంగా తీసుకున్నారు

రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆదర్శంగా తీసుకుని అధికారులు పనిచేస్తున్నారని మాజీ మంత్రి డీఎల్ రవీంద్రారెడ్డి అన్నారు. సోమవారం ఖాజీపేట పంచాయతీ ఆఫీసులో గత మూడేళ్లుగా జరిగిన పనులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా డీఎల్ మాట్లాడుతూ పంచాయతీలో అనేక అక్రమాలు జరిగాయని, మూడు సంవత్సరాలకు ముగ్గురు అధికారులను మార్చారన్నారు. వైసీపీ నాయకుల అవినీతికి అధికారులు కూడా సహకరిస్తూ బిల్లులు మంజూరు చేస్తున్నారన్నారు. సుంకేసుల రోడ్డుపై మట్టి పల్లి బిల్లులు చేసుకున్నారని, అలాగే చాలాచోట్ల అవినీతి జరిగిందని.. వీటిపై ఉన్నతాధికారులు విచారణ జరిపితే నిజాలు బయటకు వస్తాయన్నారు.



'ఆంధ్రజ్యోతి' పేపర్ చూపుతున్న డీఎల్



చెస్‌లో సత్తా చాటిన కడప చిన్నారి

కడప (స్పోర్ట్స్) జూన్ 24: చెన్నై నగరంలోని రాయపేటలో ఈనెల 23న చెన్నై రోటరీ క్లబ్, వైఎంసీఏ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్నేషనల్ ఎఫ్ఐడీఈ ర్యాపిడ్ రేటింగ్ చెస్ టోర్నమెంట్‌లో కడప నగరానికి చెందిన చిన్నారి అమీనా సత్తా చాటింది. అండర్-8 బాలికల విభాగంలో తొమ్మిదవ స్థానం సాధించింది. సుమారు 650 మంది చెస్ క్రీడాకారులు పాల్గొన్న ఈ చెస్ టోర్నమెంట్‌లో అమీనా ప్రతిభ కనబరచడం పట్ల పలువురు జిల్లా చెస్ క్రీడాకారులు హర్షం వెలిబుచ్చారు.

వైభవంగా పార్వేట మహోత్సవం

పుల్లంపేట, జూన్ 24: పుల్లంపేట స్థానిక పర్వతవర్ధిని దేవి శాంతిలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారికి పార్వేట మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. శివపార్వతులను ప్రత్యేకంగా అలంకరించి రథంపై గ్రామోత్సవం నిర్వహించారు. బస్టాండులోని నభ హైస్కూల్ ప్రాంగణంలో శివపార్వతులను తీసుకువచ్చి వేదపండితులు ప్రత్యేక పూజలు చేసి కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో శాశ్వతంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి శివాలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

'భూములను దళితులకు పంచిపెట్టాలి'

రాజంపేట, జూన్ 24: మండలంలోని సిద్ధవరం పంచాయతీలోని సర్వేనంబరు 407లోని 7 రకాల బ్లాక్ ప్లాంటేషన్ భూమిని సిద్ధవరం పంచాయతీలోని దళితులకు పంచిపెట్టాలని సోమవారం సీపీఐ నాయకులు రాజంపేట ఆర్డీఓ మోహన్‌రావుకు వినతిపత్రం ఇచ్చారు. పెనగలూరు మండల సీపీఐ కార్యదర్శి ఆదినారాయణ, బీకేఎం అధ్యక్షుడు రేపూరి శంకరయ్య, సహాయ కార్యదర్శి లక్ష్మీనారాయణ, కోశాధికారి రాజశేఖర్, రైల్వేకోడూరు మండల కార్యదర్శి జ్యోతి చిన్నయ్యలు ఈ విషయంపై గతంలో అనేకసార్లు ఉన్నతాధికారులకు తెలిపి ఉన్నారని, ఇప్పటికైనా అధికారులు స్పందించి భూములను ఎస్సీ, ఎస్టీ నిరుపేదలకు పంచిపెట్టాలని ఈ సందర్భంగా వారు కోరారు.

ముఖ్యమంత్రిని కలిసిన ప్రసాద్‌బాబు


చంద్రబాబుతో ప్రసాద్‌బాబు

రాయచోటి(కలెక్టరేట్), జూన్ 24: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ప్రసాద్‌బాబు విజయవాడలో కలిశారు. పార్టీ అధికారంలోకి వచ్చిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. రాయచోటి, రాజంపేట నియోజకవర్గాలలో గెలుపోటములపై చర్చించారు.

ఆదమరిస్తే అంతే..!

- గుంతలమయంగా మండల కేంద్రం
- ప్రధాన రహదారులపై వర్షపు నీరు

సుండుపల్లె, జూన్ 24: మండల కేంద్రంలోని పలు ప్రధాన రహదారులు వర్షపు నీటితో నిండిపోయాయి. వాహనదారులు, బాటసారులు రోడ్లపై తిరగాలంటే అష్టకష్టాలు పడుతున్నారు. నిత్యం రాకపోకలు జరిగే మండల కేంద్రంలోని ప్రధాన ఆర్‌అండ్‌బీ రహదారితో పాటు ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లే రోడ్డు, పోలీస్ స్టేషన్ సమీపంలో పీలేరు ప్రధాన రహదారి పక్కన, అలాగే రాయచోటి రహదారిలో గుల్లవాండ్లపల్లె దగ్గర ప్రధాన రహదారిపై గుంతల్లో వర్షపు నీరు చేరింది. సుమారు మీటరు లోతు గుంతలు ఏర్పడ్డాయి. అలాగే రాయవరం ప్రధాన రహదారి కెనరా బ్యాంకు వద్ద వర్షపు నీరు పడితే చాలు ఆర్‌అండ్‌బీ రోడ్డు దాటాలంటే ఇబ్బందులు తప్పడం లేదని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ద్విచక్ర వాహనంలో వెళ్లిన పలువురు నీటిగుంటలో పడి గాయాలైన సంఘటనలు ఉన్నాయి. అలాగే మండల కేంద్రంలోని బిగ్ మార్ట్ వద్ద వర్షపు నీరు చేరింది. నిత్యం రాకపోకలు జరగడం వలన రోడ్ల మీద నడిచేందుకు కష్టతరంగా మారింది.


రాయచోటి ప్రధాన రహదారి గుల్లవాండ్లపల్లె వద్ద కుంటను తలపిస్తున్న రోడ్డు

నిత్యం అధికారులు అదే రోడ్డుపై రాకపోకలు సాగిస్తున్నా సమస్య పరిష్కారానికి మాత్రం మొగ్గుచూపడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే మండల కేంద్రానికి బయట ప్రధాన రహదారులపై ఉన్న గుంతల్లో వర్షపు నీరు ప్రధాన రహదారి మృత్యుశకటంగా మారింది. రాయచోటి నుంచి సుండుపల్లె మార్గం మధ్యలో కొంతవరకు ప్రధాన రహదారి డబుల్ రోడ్డు నిర్మాణం చేసి ఆపేశారు. రోడ్డు సౌకర్యం సరిగ్గా లేక ప్రమాదాలు జరుగుతున్నాయి. డబుల్ రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.


ఎంపీడీవో కార్యాలయం సమీపంలో రోడ్డుపై ఏర్పడిన నీటి గుంతలు


పోలీస్‌స్టేషన్ సమీపంలో రహదారిపై వర్షపు నీరు

బిల్లులు ఇవ్వాలంటూ నిరసన


తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వాహనాల యజమానులు

రైల్వేకోడూరు, జూన్ 24: ఎన్నికల సందర్భంగా వివిధ అధికారులకు వాహనాలను తిప్పిన యజమానులకు ఇంతవరకు బకాయిలు ఇవ్వలేదని వాహనాల యజమానులు సోమవారం కోడూరు తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు 50 రోజుల పాటు అధికారులు ఎన్నికలకు తమ వాహనాలను తిప్పుకుని ఇంతవరకు బకాయిలు ఇవ్వడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కాళ్లు అరిగేలా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోలేదని, తమ వాహనాలకు ఫైనాన్స్ ఉన్నందున ఫైనాన్స్ కంపెనీ వారు వాహనాలను తీసుకెళ్తామని చెబుతున్నారన్నారు. కలెక్టర్ జోక్యం చేసుకుని తమ బకాయిలు ఇప్పించాలని వారు కోరారు. ఈ విషయమై తహసీల్దార్ శివరాముడు మాట్లాడుతూ డబ్బులు ఇంకా రాలేదని, వచ్చిన వెంటనే వాహనాల యజమానులకు ఇస్తామని వివరించారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

- బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేశ్‌నాయుడు


సమస్యలపై చర్చిస్తున్న రమేశ్‌నాయుడు

నందలూరు,జూన్ 24: రాజంపేట నియోజకవర్గంలో ప్రజల సమస్యలు పరిష్కారానికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు అన్నారు. సోమవారం బస్టాండు వద్ద ఉన్న ఓ కార్యాలయంలో మండలంలోని బీజేపీ నాయకులు ఏర్పాటు చేసిన తేనేటి విందులో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని భూకబ్జాలపై, సీజనల్ వ్యాధులపై, తాగునీటి సమస్యపై, అధికారుల వ్యవహార శైలిపై తదితర అంశాలపై ఆయన స్థానిక కార్యకర్తలతో చర్చించారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు పోతురాజు మస్తానయ్య, హిమగిరియాదవ్, బీజేపీ సీనియర్ నాయకులు విఠలాచార్య, మండల అధ్యక్షుడు శివారెడ్డి, టీడీపీ మైనార్టీ నాయకుడు సయ్యద్ అమీర్, షేక్‌మౌలా తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై స్పందించాలి : ఎంపీపీ

లక్కిరెడ్డిపల్లె, జూన్ 24: ప్రజా సమస్యలపై అధికారులు వెంటనే స్పందించి వారి సమస్యలు పరిష్కరించాలని ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ సభాభవనంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖల వారిగా అధికారులు మాట్లాడారు. ముందుగా అనంతపురం, ఈడిగపల్లె, వడ్డెపల్లె, మద్దిరేవుల గొల్లపల్లె గ్రామాలకు విద్యుత్ సమస్య ఉందని, ఆ గ్రామాలకు చెందిన ప్రజా ప్రతినిధులు సభాదృష్టికి తీసుకెళ్లారు. అలాగే రామాపురం, లక్కిరెడ్డిపల్లె ఆర్టీసీ బస్సు సర్వీసును ఏర్పాటు, సబ్సిడీ వేరుశనగ విత్తనకాయలు, ఎరువులు, తాగునీరు సమస్య, సీజనల్ వ్యాధుల గురించి చర్చించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ రమాదేవి, అన్ని శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

వ్యవసాయ భూమి ఆక్రమించారని ఫిర్యాదు

రాయచోటిటౌన్, జూన్ 24: జిల్లా పరిధిలోని సుండుపల్లె మండలం సుండుపల్లె గ్రామ పంచాయతీలో వడ్ల తురకపల్లెకు సమీపంలో సర్వే నెంబరు 2731లో ఐదు ఎకరాలు భూమి తన పేరుతో, సర్వే నెంబరు 2732/2లో తన కుమారుడు పేరుతో భూమి ఉందని, ఆ భూమి పక్కనే భూమిగల రెడ్డెయ్య అనే వ్యక్తి తమ భూమిని దౌర్జన్యంగా జేసీబీతో చదును చేసి ఆక్రమించాడని మండల కేంద్రంలోని కృష్ణానగర్‌కు చెందిన షేక్. అహ్మద్‌బాషా సోమవారం ఎస్పీ కృష్ణారావుకు ఫిర్యాదు చేశాడు. ఈ నెల 6న సుండుపల్లె పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఫిర్యాదులో వివరించారు.

29న లోక్ అదాలత్


సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి ఫైజున్నిసా

లక్కిరెడ్డిపల్లెజూన్ 24: లక్కిరెడ్డిపల్లె సివిల్ కోర్టు నందు ఈ నెల 29న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం ఉంటుందని, కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సివిల్ జడ్జి షేక్ ఫైజున్నిసా తెలిపారు. సోమవారం స్థానిక సివిల్ కోర్టులో సమావేశం నిర్వహించారు. ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆమె తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీఐ జీవన్‌గంగనాథబాబు, ఎస్‌ఐలు విష్ణువర్ధన్, పోలీసులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలి

- సుండుపల్లెలో విద్యార్థుల ర్యాలీ

సుండుపల్లె, జూన్ 24: విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని మండల విద్యాశాఖ అధికారి రవీంద్రనాయక్, ఎస్ఐ ఎస్‌కేఎం హుస్సేన్‌లు తెలిపారు. సోమవారం మాధురి స్కూల్ విద్యార్థినీ, విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఆదివారం ఇంటర్నేషనల్ ఒలంపిక్ డే కావడంతో పాఠశాలలకు సెలవులు ఉండడం వలన సోమవారం ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. క్రీడల ప్రాధాన్యతను విద్యార్థులకు తెలియజేశారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ విద్యా పోషక రత్న అవార్డు గ్రహీత డాక్టర్ రేపన సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ విద్యార్థులకు ధ్రువపత్రాలు పంపిణీ

చిట్వేలి, జూన్ 24: చిత్తూరులో శిక్షణ ముగించుకున్న ఎన్‌సీసీ విద్యార్థులకు సోమవారం ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. 30వ ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సీసీ చిట్వేలి ట్రూప్ విద్యార్థులు ఈ నెల 11 నుంచి 20వ తేది వరకు ఎన్‌సీసీ కంబైండ్ వార్షిక శిక్షణ శిబిరం చిత్తూరులో 10 రోజుల పాటు శిక్షణ ముగించుకున్నట్లు ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్, ఎన్‌సీసీ ట్రూప్ కమాండర్ పసుపుల రాజశేఖర్‌లు సోమవారం తెలియజేశారు. పదిరోజుల శిక్షణలో నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, కడప, అన్నమయ్య జిల్లాల విద్యార్థులతో కలిసి వేపన్ ట్రైనింగ్, డ్రిల్, ఫైరింగ్, మ్యాప్ రీడింగ్, వ్యక్తిత్వ వికాసం, తదితర వాటిపై శిక్షణ పొందారని తెలిపారు.

అన్నమాచార్య విద్యార్థుల ప్రతిభ

రాజంపేట, జూన్ 24: రాజంపేట అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు జాతీయస్థాయిలో ప్రతిభ చాటారు. ఇటీవల జరిగిన స్వయం నేషనల్ ప్రోగ్రాం ఆన్ టెక్నికల్ ఆన్ హ్యాండ్స్ అండ్ లర్నింగ్ పరీక్షలో జాతీయస్థాయిలో ఉన్న ఐఐటీ, ఎన్ఐటీ యూనివర్శిటీలతో పోటీపడి 67వ స్థానాన్ని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల సాధించిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ఎంవీ నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో 8 మంది టాపర్లు కాగా అందులో ఒకరు గోల్డ్‌మెడల్ సాధించారన్నారు. 223 మంది సిల్వర్ టాపర్, 705 మంది ఎలైట్ సాధించారన్నారు. వీరికి ప్రోత్సాహక సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ సుబ్బారావు, కిషోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

రాజంపేట, జూన్ 24: అన్నమయ్య జిల్లా కమిటీ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నూతన కార్యవర్గం ఎన్నిక సోమవారం జరిగింది. రాజంపేట ప్రాంత జిల్లా ప్రధాన కార్యదర్శిగా పి.వి.రమణ, ఉపాధ్యక్షులుగా సిహెచ్ బాబయ్య, లక్ష్మీదేవి, ప్రసాద్, సహాయ కార్యదర్శులుగా విజయ్‌కుమార్, ఏడు కొండలు, రెడ్డయ్య, జిల్లా కమిటీ సభ్యులుగా గంగయ్య, బాలాజీ, సురేష్, మధులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ కార్మిక సమస్యల కోసం ఎంతటి పోరాటమైనా చేస్తామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి చిట్వేలి రవికుమార్ పేర్కొన్నారు.

వైసీపీకి అక్రమ సంపాదనపై ఆశ చావలేదు

- టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు


అన్నాక్యాంటీన్ పరిశీలిస్తున్న జగన్‌మోహన్‌రాజు

రాజంపేటటౌను, జూన్ 24: వైసీపీని రాష్ట్ర ప్రజలు ఓడించినప్పటికీ ఆ నాయకులకు మాత్రం ఇంకా అక్రమ సంపాదనపై ఆశ చావలేదని టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు పేర్కొన్నారు. సోమవారం రాజంపేట పార్లమెంట్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడి 20 రోజులు దాటుతున్నా ఇప్పటికీ వైసీపీ నాయకులు మైనింగ్, ఇసుక లూటీ చేయడం ఆపలేదన్నారు. ప్రభుత్వం మారింది కదా ఇకనైనా దుశ్చర్యలు మానుకుందామన్న ఆలోచన రాకపోవడం దారుణమన్నారు. ఎన్నికల హామీల్లో భాగంగా వికలాంగులకు, వృద్ధులకు రూ.వెయ్యి పెన్షన్ పెంచుతూ గడచిన మూడు నెలల బకాయిలు రూ.3 వేలతో కలిపి రూ.7 వేలు ఒకటో తేదీన పెన్షన్‌దారులకు పింఛను అందించడం జరుగుతుందన్నారు.

అన్నా క్యాంటీన్ పరిశీలన

రాజంపేటలో పునః ప్రారంభించనున్న అన్నా క్యాంటీన్‌ను మున్సిపల్ కమిషనర్ రాంబాబుతో కలిసి పరిశీలించారు. అన్నా క్యాంటీన్ పునఃప్రారంభం సందర్భంగా ఏర్పాట్లపై కమిషనర్‌తో మాట్లాడారు. వెంటనే యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు, రాష్ట్ర కార్యదర్శి కుమార్, కార్యనిర్వాహక కార్యదర్శి సుబ్రమణ్యంనాయుడు, పార్లమెంట్ అధికార ప్రతినిధి ప్రతాప్‌రాజు, కౌన్సిలర్లు రాజేష్, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవోపేతం వీరభద్రుడి పల్లకీ ఉత్సవం


పల్లకీ ఉత్సవంలో భద్రకాళీ సమేత వీరభద్రుడు

రాయచోటిటౌన్, జూన్ 24: దక్షిణకాశీగా పేరుగాంచిన రాయచోటి పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో సోమవారం పల్లకీ ఉత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్‌పర్సన్ పోలంరెడ్డి విజయ, ఆలయ ఈవో రమణారెడ్డిల ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు శంకరయ్య, కృష్ణయ్య స్వాముల వేదమంత్రోచ్చారణల మధ్య భద్రకాళీ సమేత వీరభద్రుడు ఉత్సవ విగ్రహాలను అభిషేకాలు నిర్వహించి వివిధ రకాల పుష్పాలు, పట్టు వస్త్రాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి పల్లకీ ఉత్సవంపై ఆలయం చుట్టూ మాడవీధుల్లో ప్రదక్షిణలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ భక్తులతో పాటు కన్నడ భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అర్చక స్వాములు ఆలయానికి వచ్చిన భక్తులందరికీ అర్చనలు చేసి తీర్థప్రసాదాలు అందించారు.

తిరుమలకు పాదయాత్ర

లక్కిరెడ్డిపల్లె, జూన్ 24: మండలంలోని వడ్డెపల్లె గ్రామస్థులు సోమవారం శివానందం ఆధ్వర్యంలో దిన్నెపాడు వడ్డెపల్లె నుంచి పాదయాత్ర ప్రారంభించి తిరుమలకు బయలుదేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గ ఎమ్మెల్యేగా మండిపల్లె రాంప్రసాదురెడ్డి గెలవాలని, తిరుమల వెంకటేశ్వర స్వామికి దిన్నెపాడు, వడ్డెపల్లె గ్రామస్థులు మొక్కుకున్నారని, ఇందులో భాగంగా మొక్కుబడులు తీర్చుకునేందుకు వెళుతున్నట్లు తెలిపారు. దిన్నెపాడు వడ్డెపల్లె నుంచి బయలుదేరి లక్కిరెడ్డిపల్లెకు చేరుకోగా లక్కిరెడ్డిపల్లెలో టీడీపీ రాజంపేట పార్లమెంటు డాక్టర్ల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ షఫీనాయక్ పూలమాలల వేసి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బీసీ నాయకుడు దేరంగుల పీరయ్య, రైతు ఆంజనేయులు, సుబ్బరాజు, గురయ్య, సంజీవరాజు, అచ్చరాజు, సుదర్శన్ బాబు, రామాంజనేయులు, యల్లయ్య, రైతు చిన్న రంగన్న, రెడ్డెయ్య, మహిళలు పాల్గొన్నారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

- రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి శ్రీనివాసులు

రాయచోటి(కలెక్టరేట్), జూన్ 24: నియోజకవర్గ పరిధిలోని రామాపురం మండలం బండపల్లి గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 200/1లో 5 ఎకరాల దళితుల భూములను ఆక్రమించిన మన్సూరు బాస్కర్‌పై చర్యలు తీసుకోవాలని సీపీఐ నేతలు డిమాండ్ చేశారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా జాయింట్ కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడారు. కార్యక్రమంలో బాధిత దళితులు న్యరాయుడు, రామచంద్ర, ఓబులేసు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలలను రద్దు చేయాలి

రాయచోటి(కలెక్టరేట్), జూన్ 24: పట్టణంలో నిబంధనలు పాటించని ప్రైవేటు పాఠశాలలను రద్దు చేయాలని ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ తుమ్మల లవకుమార్ సోమవారం కలెక్టరేట్‌కు గ్రీవెన్స్‌సెల్‌లో ఫిర్యాదు చేశారు. అడ్మిషన్ల ఫీజులు, బుక్స్, యూనిఫామ్, అన్ని రకరకాల పేర్లతో విద్యార్థులను నిలువు దోపిడీ చేస్తున్న ప్రైవేటు పాఠశాలల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు అర్జీలో పేర్కొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

రాజంపేట, జూన్ 24: రాజంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రతిభ సాధించిన విద్యార్థులకు ప్రిన్సిపల్ వెంకటరామరాజు సోమవారం ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఇటీవల ఏలూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ యూనివర్శిటీలో ప్రతిభ సాధించి అత్యధిక మార్కులు సాధించిన కె.సాయిశ్వేతకు బహుమతులు అందజేశారు. అదేవిధంగా ప్రతిభ సాధించి పీఐటీలో సీటు పొందిన కె.కీర్తి, యు.శివసాయి కార్తీక్, సాయిశ్వేతకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

'శ్మశానవాటికకు కేటాయించిన స్థలం ఆక్రమణ'

రైల్వేకోడూరు, జూన్ 24: పంచాయతీ పరిధిలోని అంబేడ్కర్ నగర్‌లో శ్మశానవాటికకు కేటాయించిన స్థలాన్ని కొందరు వ్యక్తులు దర్జాగా అనుభవిస్తున్నారని స్థానికుడు ఎర్రతోట బాబు ఆరోపించారు. సోమవారం శ్మశానవాటిక ఆక్రమణపై స్థానిక తహసీల్దార్ శివరాముడు, కోడూరు పంచాయతీ కార్యదర్శి ప్రసాద్‌రావులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి పై భాగంలో సర్వే నెంబరు 773లో 3.90 ఎకరాలు భూమి ఉందని, రెవెన్యూ రికార్డు ప్రకారంగా ఈ సర్వే నెంబరులో భూమి ఉందని నమోదు చేసి ఉన్నారన్నారు. గ్రామ బాగు కోసం తాను కోర్టులో ఉన్న భూమిని శ్మశానవాటికకు కేటాయించాలని ఆశ్రయించామని, కోర్టు కూడా తమకు అనుకూలంగా ఆర్డర్ ఇచ్చి ఉన్నారన్నారు. జిల్లా కలెక్టర్, రాజంపేట ఆర్డీవో, మండల రెవెన్యూశాఖ అధికారులకు కోర్టు ఆర్డర్ కాపీలు, వినతులు పంపామని తెలిపారు. అధికారులు పరిశీలించి అంబేడ్కర్ నగర్‌కు శ్మశానవాటిక ఏర్పాటు చేయాలని కోరారు.

నిబంధనలు అతిక్రమిస్తే ఉపేక్షించేది లేదు : తహసీల్దారు

- రూ.3.60 లక్షల నీటి పన్నులు రాబట్టాలి
- ప్రజలకు అందుబాటులో ఉండాలి

ఓబులవారిపల్లె, జూన్ 24: ప్రభుత్వ భూములను ఆక్రమించడం, చెరువు మట్టి అక్రమంగా తరలించడం వంటి చర్యలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని తహసీల్దారు శేషగిరిరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశామని, గతంలో వలంటీర్ల ద్వారా గ్రామాల్లో సేకరించిన కుల, ఆదాయ వంటి ధ్రువీకరణ పత్రాలను సుమారు 2300 ఉచితంగా ధ్రువీకరించి జారీ చేసినట్లు తెలిపారు. మూడేళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న రూ.3.60 లక్షల నీటి పన్నులు విడతల వారి వసూళ్లు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. అలాగే ప్రభుత్వ భూములను ఆక్రమించడం, చెరువు మట్టిని అక్రమంగా తరలించడం వంటి చర్యలకు పాల్పడితే చట్టప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. చెరువు పూడిక తీయడానికి ఇరిగేషన్ అధికారుల నుంచి అనుమతులు పొందిన తర్వాతే తవ్వకాలు చేపట్టాలని తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక

సిద్దవటం, జూన్ 24: కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం ఉదయం 9 గంటలకు తహసీల్దారు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించామని, మండలస్థాయి అధికారులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, వీఆర్ఓలు, గ్రామ సర్వేయర్లు, కార్యాలయ సిబ్బంది హాజరైనట్లు తెలిపారు. ఇందుకు గాను 7 అర్జీలు ఆన్‌లైన్ ద్వారా వచ్చాయన్నారు. ఈ అర్జీలన్నీ విచారణ చేసి వారి వారి సమస్యలను ప్రభుత్వ నిబంధనల మేరకు పరిష్కరించి కలెక్టర్‌కు నివేదికలు పంపనున్నట్లు తహసీల్దారు తెలియజేశారు.

యల్లమ్మ తల్లి ఆలయంలో అన్నదానం

సుండుపల్లె, జూన్ 24: మండల కేంద్రానికి సమీపంలోని చెన్నంశెట్టిపల్లె సమీపంలో వెలసిన యల్లమ్మ తల్లి జాతర మహోత్సవంలో భాగంగా సోమవారం అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పూజాది కార్యక్రమాలు, తీర్థప్రసాదాల వినియోగం అనంతరం పెద్ద సంఖ్యలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాత్రికి యల్లమ్మ తల్లి గ్రామోత్సవం నిర్వహించడంతో పాటు చాందినీ బండ్ల ప్రదర్శన ఉన్నట్లు గ్రామస్థులు తెలిపారు.

వరసిద్ధుడి సేవలో కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి



న్యాయమూర్తికి జ్ఞాపికను అందిస్తున్న ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి

ఐరాల(కాణిపాకం), జూన్ 24: కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామిని కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.నటరాజన్ సోమవారం దర్శించుకున్నారు. ఆయన్ను ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం ఆయన్ను వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఆలయ సూపరింటెండెంట్ వాసు, ఇన్‌స్పెక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

కణితి మాంసం స్వాధీనం

ఇద్దరి అరెస్టు, నాటు తుపాకి, బైక్ సీజ్



భాకరాపేట, జూన్ 24: కణితి మాంసం తరలిస్తుండగా ఇద్దరిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి కణితి మాంసంతోపాటు నాటు తుపాకి, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. భాకరాపేట ఫారెస్టు రేంజర్ దత్తాత్రేయ తెలిపిన వివరాల మేరకు.. పెదురు కుప్పం మండలం తిరుమలయ్యపల్లె షికారీ కాలనీకి చెందిన సురేశ్, శ్రీనివాసులు నాటు తుపాకీతో కణితిని కాల్చి మాంసం తీసుకొస్తుండగా భాకరాపేట బీట్ పరిధిలో అదుపులోకి తీసుకున్నారు. నిందితులను రిమాండుకు పంపారు. ఈ దాడుల్లో ఎఫ్ఎస్‌వో తౌఫిక్ ఇస్లాం, ఎఫ్‌బీవోలు సదాశివయ్య, లోకనాథం పాల్గొన్నారన్నారు.

మంత్రి లోకేశ్‌కి శ్రీవారి ప్రసాదాలు



చంద్రగిరి, జూన్ 24: వెలగపూడిలోని సచివాలయంలో మంత్రిగా సోమవారం బాధ్యతలు స్వీకరించిన నారా లోకేశ్‌ని చంద్రగిరి మండలానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీరపల్లి హేమాంబరధర రావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి శ్రీవారి తీర్థ ప్రసాదాలు అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు.

ఆవుల దొంగకు ఆరునెలల జైలు, జరిమానా



శైలేష్

చిత్తూరు లీగల్, జూన్ 24: రెండు ఆవులను తీసుకెళ్లి గుట్టుచప్పుడు కాకుండా అమ్మేసిన నిందితుడికి చిత్తూరు న్యాయస్థానం ఆరునెలల జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పింది. బంగారుపాళ్యం దళితవాడకు చెందిన మురళి తనకున్న రెండు ఆవులను మేపుకుంటూ కుటుంబాన్ని పోషించేవారు. ఈ క్రమంలో 2020 జూలై 26న ఈ ఆవులను బంగారుపాళ్యం మండలం ముత్తుబంగారునగర్ కాలనీలోని శైలేష్ తీసుకెళ్లి అమ్మేశాడు. బంగారుపాళ్యం పోలీసులు శైలేష్‌పై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు సోమవారం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో వాయిదా ఉండగా, శైలేష్‌పై నేరం రుజువుకావడంతో అతడికి ఆరునెలల జైలు శిక్ష, రూ.10వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి ఉమాదేవి తీర్పు చెప్పారు. ఈ కేసును ఏపీపీ కృష్ణారెడ్డి వాదించారు.

టమోటా తోటల్లో దొంగలు పడ్డారు

సోమల, జూన్ 24: టమోటాకు గిట్టుబాటు ధరలు ఉండడంతో చిల్లర దొంగలు తోటల్లో పడ్డారు. టమోటాలను కోసుకెళుతున్నారు. ఆదివారం రాత్రి సోమల- సదుం మార్గం అభయాంజనేయస్వామి ఆలయం సమీప బాయిగడ్డ నరసింహులు పొలంలోని టమోటా తోటలో కోతకు సిద్ధంగా ఉన్న 50 బాక్సుల టమోటాలను కోసుకెళ్లారు. నరసింహులుకు చెందిన రెండు ఎకరాలను కలకడకు చెందిన మురళి లీజుకు తీసుకుని టమోటా సాగు చేశారు. రైతులు పొలం వద్ద ఉన్నప్పటికీ రాత్రి కురిసిన వర్షానికి ఇంటి రావడంతో టమోటాలు చోరీ జరిగింది. చిన్న సోమల మార్గంలోని పలు తోటల్లో టమోటాలు చోరీలు జరుగుతున్నట్లు రైతులు తెలిపారు. 15 కిలోల బాక్సు రూ.800 వరకు పలకడంతో చిల్లర దొంగలు చోరీలకు పాల్పడుతున్నారు. కొందరు రైతులు పొలాల వద్ద విద్యుత్ లైట్లు ఏర్పాటు చేసి అక్కడే కాపు కాస్తున్నారు. కొంత ఆదమరిస్తే దుండగులు టమోటాలను కోసుకెళుతున్నారు.

కుప్పం అర్బన్ సీఐగా జీటీ నాయుడు



కుప్పం, జూన్ 24: కుప్పం అర్బన్ సీఐగా జీటీ నాయుడు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అలాగే, రూరల్ సీఐగా మల్లేష్ యాదవ్ నియమితులయ్యారు. ఇంతకుముందు ఇక్కడ పనిచేస్తున్న అర్బన్, రూరల్ సీఐలు రమణ, ఈశ్వర్‌రెడ్డిని అనంతపురం వీఆర్‌కు పంపిన విషయం తెలిసిందే.

కుమార్తె ప్రేమ వివాహం.. తల్లిదండ్రుల ఆందోళన



పోలీస్‌స్టేషన్ ముందు కుటుంబీకుల నిరసన

పుంగనూరు రూరల్, జూన్ 24: ఒక్కగానొక్క బిడ్డ ప్రేమ వివాహం చేసుకొంది. తమ కుమార్తెను తమకు అప్పగించాలని పోలీసు స్టేషన్ ఎదుట తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. ఈ ఘటన సోమవారం రాత్రి పుంగనూరులో జరిగింది. మండలంలోని పాళ్యంపల్లెకు చెందిన రమణప్ప, జ్యోతిదంపతుల ఏకైక కుమార్తె బావనశ్రీ (20). తిరుపతిలో చదువుకుంటున్న ఈమె.. అదే గ్రామానికి చెందిన మహేశ్‌రెడ్డి ప్రేమించుకుంటున్నారు. రెండు నెలల కిందట ఆమె స్వగ్రామానికి వచ్చింది. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం ప్రేమికులు ఇంటినుంచి వెళ్లిపోయి పెళ్లి చేసుకున్నారు. రక్షణ కోసం పలమనేరు డీఎస్పీ విష్ణురఘువీర్‌ను ఆశ్రయించారు. వీళ్ల మేజర్లు కావడంతో పుంగనూరు పోలీసులకు డీఎస్పీ సమాచారం ఇచ్చారు. పోలీసుల సమాచారంతో రమణప్ప, జ్యోతి తమ బంధువులతో కలసి పుంగనూరు పోలీస్‌స్టేషన్ చేరుకున్నారు. తమ కుమార్తెను తమకు అప్పగించాలని కోరారు. మేజర్లు కావడంతో పోలీసులు అందుకు నిరాకరించారు. దీంతో తమ కుమార్తెను పంపని పక్షంలో పెంట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకుంటామని స్టేషన్ ముందు బైఠాయించారు. దీంతో కొంత సమయం ఉద్రిక్తత నెలకొంది. పలమనేరు డీఎస్పీ వెంటనే పుంగనూరుకు చేరుకుని యువతి తల్లిదండ్రులతో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు.

బర్డ్‌లో నిలిచిన ఉచిత మోకాళ్ల మార్పిడి శస్త్ర చికిత్సలు

తిరుపతి(వైద్యం), జూన్ 24: టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న బర్డ్ ఆస్పత్రిలో ఈనెల ఒకటో తేదీనుంచి ఉచిత మోకాళ్ల మార్పిడి శస్త్ర చికిత్సలు నిలిపేయడంతో రోగులు ఇబ్బందులకు గురవుతున్నారు. బర్డ్ ప్రత్యేకాధికారిగా గతంలో పనిచేస్తున్న డాక్టర్ రాచపల్లి రెడ్డెప్పరెడ్డి గత నెల 31వ తేదీన తన పదవికి రాజీనామా చేశారు. మరునటి రోజునే ఆయన స్థానంలో ఆర్ఎంవో డాక్టర్ కిశోర్‌కుమార్‌ని ఇన్‌చార్జిగా టీటీడీ నియమించింది. ఆయన బాధ్యతలు చేపట్టిన రోజు నుంచే ఈ శస్త్ర చికిత్సలను నిలిపేశారు. కేవలం నగదు చెల్లించిన వారికి మాత్రమే శస్త్ర చికిత్సలు చేస్తున్నారు. వీటిల్లో మోకాళ్ల మార్పిడి శస్త్ర చికిత్స తర్వాత అమర్చే ఇంప్లాంట్ సాధారణమైనది రూ.72వేలు, నాణ్యమైనదైతే రూ.1.35 లక్షలు చెల్లించాలి. మూడు వారాల వ్యవధిలో దాదాపు 70కిపైగా మోకాళ్ల మార్పిడి శస్త్ర చికిత్సలు చేశారు. వీటిల్లో అన్నీ నగదు చెల్లించిన వారికి మాత్రమే చేయడం విశేషం. ఇక గత ప్రభుత్వ హయాంలో సిఫారసులున్న వారికే శస్త్ర చికిత్సలు చేసేవారు. తాజాగా ఉచిత శస్త్ర చికిత్సలు పూర్తిగా ఆపేయడంతో నిరుపేద రోగులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయంపై బర్డ్ ఇన్‌చార్జి ప్రత్యేకాధికారి, ఆర్ఎంవో కిశోర్‌కుమార్‌ను వివరణ కోరగా.. రెగ్యులర్ డైరెక్టరు లేనందున ఉచిత శస్త్ర చికిత్సలు చేయడం లేదని చెప్పారు. కేవలం నగదు చెల్లించిన వారికి మాత్రమే చేస్తున్నామన్నారు. రెగ్యులర్ డైరెక్టరును నియమించే వరకు ఇదే పరిస్థితి ఉంటుందని తెలిపారు.

శ్రీవారి ట్రస్టులకు రూ.20 లక్షల విరాళం



తిరుమల, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ట్రస్టులకు సోమవారం రూ.20లక్షలు విరాళంగా అందాయి. జార్ఖండ్‌కు చెందిన సరళా ఇంజనీరింగ్ లిమిటెడ్ ఈ విరాళాలను అందజేసింది. ఎస్వీబీసీ ట్రస్టుకు రూ.10 లక్షలు, ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షలు అందజేశారు. ఈమేరకు సంస్థ ప్రతినిధి తిరుపతికి చెందిన రాఘవేంద్ర సోమవారం తిరుమలలోని గోకులం విశ్రాంతి గృహంలో ఈవో శ్యామలరావుకు డీడీలను అందజేశారు.

పసుపుమయం.. అధికారుల దళం

కుప్పంలో సీఎం పర్యటన ఏర్పాట్లు పూర్తి





కుప్పంలో వెలసిన స్వాగత బ్యానర్లు, ఎన్టీఆర్ విగ్రహం ఎదుట ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ తదితరులు

కుప్పం, జూన్ 24: ముఖ్యమంత్రి చంద్రబాబు కుప్పం పర్యటన ఏర్పాట్లు సోమవారం రాత్రికి పూర్తయ్యాయి. వారం రోజులుగా జిల్లా.. స్థానిక అధికార యంత్రాంగం కూడా కుప్పంలోనే ఉండి, ఏర్పాట్లను పర్యవేక్షిస్తోంది. మరోవైపు టీడీపీ శ్రేణులు కుప్పాన్ని పసుపుమయం చేశాయి. ఆదివారందాకా అప్పటి కలెక్టర్ షన్మోహన్.. సోమవారం మధ్యాహ్నం నుంచి కొత్త కలెక్టరు సుమిత్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఎస్పీ మణికంఠ ఆధ్వర్యంలో భద్రతా చర్యలు చేపట్టారు. సోమవారం రాత్రికి కుప్పం చేరుకున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అధికారులతో సమన్వయం చేసుకుని సీఎం పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షించారు. పీఈఎస్ వైద్య కళాశాల మైదానంలో హెలిప్యాడ్ సిద్ధం చేశారు. బహిరంగ సభ కోసం ఎన్టీఆర్ విగ్రహం ఎదుట ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ వద్ద వినతుల స్వీకరణకు పటిష్ఠమైన బ్యారికేడింగ్ నిర్మించారు. కాగా, సీఎం చంద్రబాబు పర్యటించే ప్రాంతాలను సోమవారం అధికారులు పరిశీలించారు. మరోవైపు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అదనపు పోలీసు బలగాలు కుప్పంలో మోహరించాయి. సీఎం పర్యన షెడ్యూల్ ఉన్న ప్రతి చోటా ప్రభుత్వాధికారులను ఇన్‌చార్జిలుగా నియమించారు. మరోవైపు చంద్రబాబు పర్యటన నేపథ్యంలో టీడీపీ శ్రేణులు కుప్పం పట్టణాన్ని పసుపుమయం చేశాయి. అధినేతకు స్వాగతం పలుకుతూ అడుగడుగునా ఫ్లెక్సీలు, బ్యానర్లు వెలిశాయి.

చేరికలు ఉండవు

ముఖ్యమంత్రి చంద్రబాబు రాక సందర్భంగా వైసీపీనుంచి టీడీపీలోకి ఎటువంటి చేరికలు ఉండబోవని ఎమ్మెల్సీ శ్రీకాంత్ 'ఆంధ్రజ్యోతి'కి స్పష్టం చేశారు. పలువురు కౌన్సిలర్లు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు వైసీపీనుంచి టీడీపీలో చేరనున్నారన్న ప్రచారం సామాజిక మాధ్యమాల్లో సోమవారం హల్‌చల్ చేసింది. దీనిపై ఆయన స్పందించారు. ప్రస్తుతానికి ఎటువంటి చేరికలు ఉండవని, అవి తప్పుడు ప్రచారాలని కొట్టేశారు. ఆ అవసరం తమకు లేదన్నారు. ఎన్నికల్లో చంద్రబాబు విజయంకోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు, నాయకుడికి సముచిత స్థానం లభిస్తుందని చెప్పారు.

చూసి.. మాట్లాడి.. వారంలో పరిష్కారం

బాధితుల ఎదుటే కింది స్థాయి అధికారులతో మాట్లాడిన కలెక్టర్



బాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు, జూన్ 24: కొత్తగా బాధ్యతలు తీసుకున్న కలెక్టర్ సుమిత్ కుమార్ అర్జీల పరిష్కారంలో కొత్త పంథాను ఎంచుకున్నారు. ఇది వరకు ఉన్న కలెక్టర్ బాధితులు తీసుకొచ్చిన అర్జీపై సంతకం చేసి.. ఆ శాఖ జిల్లా అధికారులకు ఇచ్చేవారు. ఆ అర్జీ తపాలా ద్వారా వారానికో.. పది రోజులకో ఆయా మండలాలకు వెళ్లేది. అప్పటికే స్థానిక అధికారుల ఒత్తిడి మేరకు సమస్యను పరిష్కరించి ఉండరు. కలెక్టరేట్ నుంచి వెళ్లిన అర్జీకి కూడా టెక్నికల్ సమస్యలను జోడించి జిల్లా అధికారులకు నివేదిక ఇచ్చేవారు. ఇలా ఏ సమస్య అయినా నెలలు.. సంవత్సరాలు గడిచినా పరిష్కారం అయ్యేది కాదు. సోమవారం బాధ్యతలు తీసుకున్న సుమిత్‌కుమార్ 'ప్రజా ఫిర్యాదులు- పరిష్కార వేదిక'కు కొత్త అర్థాన్ని తీసుకొచ్చారు. అర్జీని స్వీకరించిన వెంటనే కలెక్టర్ లేదా ఆ శాఖ జిల్లా అధికారి చేత ఫోన్ చేయించి సమస్యను చెప్పేవారు. ఆ సమస్య ఏ కారణంగా పెండింగ్‌లో ఉందో చెప్పాలని అడిగారు. బాధితుల సమస్యలను పరిష్కరించి వారికి ఉపశమనం కలిగించాలని కోరారు. ఇలా ఆయన సోమవారం కొన్ని అర్జీదారులతో మాట్లాడినప్పటికీ అందరికి వారం రోజుల్లో పరిష్కారం చూపుతానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమానికి మొత్తం వంద అర్జీలు అందాయి. వీటిలో రెవెన్యూశాఖకు 77, మున్సిపల్‌శాఖకు 10, నేషనల్ హైవేకు 2, బీసీ వెల్ఫేర్‌కు 2, డీపీవోకు 2, విభిన్న ప్రతిభావంతులశాఖ, ఆరోగ్యశ్రీ, ఎంప్లాయిమెంట్, ఎంపీడీవో 1, తదితర శాఖలకు ఒక్కో అర్జీ వంతున అందాయి. ఈ కార్యక్రమంలో డీఆర్వో పుల్లయ్య, డ్వామా పీడీ రాజశేఖర్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. కలెక్టరుకు అందిన సమస్యల్లో కొన్ని..

- చిత్తూరు నగరపాలక సంస్థలో 12 మంది దళిత డ్రైవర్లకు తొమ్మిది నెలల పాటు జీతాలు ఇవ్వకుండా అధికారులు వేధింపులకు గురిచేస్తున్నారని దళిత ప్రజా వేదిక నాయకులు ఆరోపించారు. సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదులతో కూడిన అర్జీని అందించారు. 2023 సెప్టెంబరు నెల నుంచి 12 మంది దళిత డ్రైవర్లు వివిధ వాహనాలను నడుపుతున్నారని తెలిపారు. వారికి ఇవ్వాల్సిన జీతభత్యాలను ఇవ్వకపోవడంతో కుటుంబాలు గడవటం కష్టంగా ఉందన్నారు. ఇదే విషయాన్ని కమిషనర్‌ను అడిగితే మీరు ఎవరో తనకు తెలియదని నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని పెండింగ్‌లో ఉన్న వేతనాలను ఇప్పించాలని ఆ సంఘ నేతలు రాజ్‌కుమార్, మునస్వామి, ధనంజయరావు, పార్థసారథి డిమాండ్ చేశారు.
- తన భూమిని ఆక్రమించుకోవడానికి కొందరు ప్రయత్నిస్తున్నారని చౌడేపల్లె మండలం బండమీదపల్లెకు చెందిన వెంకటరమణ దంపతులు సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందించారు. 1.10 ఎకరాల భూమి తన అనుభవంలో ఉందని, ఈ భూమిలో వచ్చే ఆదాయంతోనే కుటుంబం గడుస్తోందన్నారు. దాంతో కలెక్టర్ అక్కడి నుంచే నేరుగా తహసీల్దార్‌తో మాట్లాడారు. బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు.
- చివరి దశలో ఉన్న తమకు పెన్షన్‌ను మంజూరు చేయాలని చిత్తూరు నగరం తోటపాళ్యంకు చెందిన జయరాం కోరారు. పెన్షన్ కోసం ఐదేళ్లుగా తిరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

50 ఏళ్ల ముందుచూపుతో కాణిపాకంలో ఏర్పాట్లు చేస్తాం

- సిబ్బంది యూనిఫాం, తిలక ధారణ చేసుకోవాలి
- ఉభయదారులు సహకరించాలి
- సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే మురళీమోహన్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీమోహన్

ఐరాల(కాణిపాకం), జూన్ 24: కాణిపాక ఆలయంలో 50 సంవత్సరాల ముందు చూపుతో ఏర్పాట్లు చేస్తామని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. ఆలయ సమావేశ మందిరంలో సోమవారం ఈవో వెంకటేశు ఆధ్వర్యంలో ఆయన అధికారులు, ఉద్యోగులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆలయంలో పని చేసే ఉద్యోగులు, సిబ్బంది జూలై 15 నుంచి కచ్చితంగా యూనిఫాం ధరించాలన్నారు. తిలక ధారణ చేసుకోవాలని సూచించారు. ఆలయంలో ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ప్రతి ఒక్కరు ప్రవర్తించాలన్నారు. భక్తులకు ఏదైనా అవసరం వచ్చి వారు సిబ్బందితో మాట్లాడితే దేవుడి ప్రతినిధితో మాట్లాడినట్లు సిబ్బంది ప్రవర్తన ఉండాలన్నారు. వరసిద్ధుడి ఆలయానికి చెందిన 14 గ్రామాల ఉభయదారులు అభివృద్ధి కోసం పూర్తి స్థాయిలో సహకరించాలని కోరారు. ఆలయ ఉభయదారుల గౌరవానికి ఎక్కడా భంగం కలగకుండా చూస్తానన్నారు. ఆలయ మాస్టర్ ప్లాన్ ప్రకారం చేపట్టాల్సిన కార్యక్రమాలను చేపడతామన్నారు. ఈ సమావేశంలో ఈఈ వెంకటనారాయణ, ఏఈవోలు ఎస్వీకృష్ణారెడ్డి, రవీంద్రబాబు, విద్యాసాగర్‌రెడ్డి, హరిమాధవరెడ్డి, ధనంజయ, మండల టీడీపీ అధ్యక్షుడు గిరిధర్‌బాబు, ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు, నాయకులు గంగారపుహరిబాబు నాయుడు, ఎంఎస్ చౌదరి, మధుసూదన్‌రావు, హేమాద్రినాయుడు, నరసింహులునాయుడు, విక్రం పాల్గొన్నారు.

కుప్పం ఆర్టీసీకి పూర్వ వైభవం

- డిపోకు చేరిన 38 సర్వీసులు
- చంద్రబాబుకు పాలాభిషేకం



చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎస్ఎంయూ నేతలు

కుప్పం, జూన్ 24: కుప్పం ఆర్టీసీ డిపో పూర్వ వైభవాన్ని సంతరించుకుంది. స్థానిక ఎమ్మెల్యే చంద్రబాబు ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించిన నేపథ్యంలో 38 బస్సు సర్వీసులను సోమవారం ఉన్నతాధికారులు వెనక్కు తెప్పించారు. కుప్పం ఆర్టీసీ డిపోలో 98 బస్సు సర్వీసులు నడిచేవి. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అందులోంచి 38 సర్వీసులను, సిబ్బందితో సహా తిరుమల, అలిపిరి, పుంగనూరు, పలమనేరు డిపోలకు తరలించారు. కుప్పం ఆర్టీసీకి డొక్కు బస్సులే మిగిలాయి. చాలా రూట్లలో బస్సు సర్వీసులను అధికారులు రద్దు చేశారు. ఉన్న కొద్దిపాటు డొక్కు సర్వీసులతో ప్రయాణికులు, ముఖ్యంగా విద్యార్థులు నానా అవస్థల పాలయ్యారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే ఇతర డిపోలకు తరలివెళ్లిన బస్సు సర్వీసులను వెనక్కు తెప్పించే ప్రక్రియ ప్రారంభమైంది. అలా మొత్తం 38 సర్వీసులు తిరిగి సోమవారం కుప్పం డిపోకు చేరాయి. ఈ బస్సుల్లో పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్‌లతోపాటు లగ్జరీ, సూపర్ లగ్జరీ బస్సులు ఉన్నాయి. ఈ సందర్భంగా ఆర్టీసీ ఎస్ఎంయూపీ నేతలు, టీడీపీ నాయకులు సంయుక్తంగా డిపో ఆవరణలో చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంయూపీ జిల్లా అధ్యక్షుడు ఎ.వేలు, జె.శ్రీను, డిపో ఛైర్మన్ బొట్టు మణి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంజీ.ప్రసాద్, డిపో కార్యదర్శి జయపాల్, సంయుక్త కార్యదర్శి జి.మునెప్ప, గ్యారేజ్ కార్యదర్శి రహంతుల్లా, సహాయ కార్యదర్శి నారాయణ, శ్రీనివాసులు, బాలసుబ్రహ్మం, జగ్గయ్య ప్రసాద్, తెలుగుదేశం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రుయా డిప్యూటీ సీఎస్ ఆర్ఎంవోగా హనుమంతరావు

- ఏడు నెలలుగా సెలవులో ఉన్న అధికారిని నియమించడంపై విమర్శలు
- గతంలో పనిచేసిన శాఖలో రిలీవ్ కాకనే కొత్త పోస్టులో చేరడంపై చర్చ



హనుమంతరావు

తిరుపతి(వైద్యం), జూన్ 24 : రుయాస్పత్రిలో డిప్యూటీ సీఎస్ ఆర్ఎంవోగా డాక్టర్ సి.హనుమంతరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అయితే ఏడు నెలలుగా మెడికల్ లీవులో ఉన్న ఆయన తాను గతంలో పనిచేసే శాఖలో రిలీవ్ కాకుండానే ఏకంగా డిప్యూటీ సీఎస్ ఆర్ఎంవోగా బాధ్యతలు చేపట్టారన్న విమర్శలొస్తున్నాయి. ఆస్పత్రి వర్గాల్లో దీనిపై చర్చ నడుస్తోంది. వివరాలిలా ఉన్నాయి. హనుమంతరావు గతంలో వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో గూడూరు డివిజన్‌కు డిప్యూటీ డీఎంహెచ్‌వోగా విధులు నిర్వహించే వారు. అనారోగ్య కారణాలతో గత ఏడాది నవంబరు ఒకటినుంచి ఈనెల 17వ తేదీవరకు మెడికల్ లీవులో ఉన్నారు. ఈ క్రమంలో తిరిగి విధుల్లో చేరుతున్నట్లు వైద్య ఆరోగ్యశాఖ అధికారికి రిపోర్టు చేయలేదు. ఈ పరిస్థితుల్లో డైరెక్టర్ ఆఫ్ హెల్త్ అధికారి ఆయన్ను నేరుగా రుయా డిప్యూటీ సీఎస్ ఆర్ఎంవోగా నియమించడమే విమర్శలకు తావిచ్చింది.

నిబంధనలకు విరుద్ధంగా ఓ ప్రైవేటు కాలేజీలో పనిచేశారు!

హనుమంతరావు మెడికల్ లీవులో ఉన్నప్పుడు నిబంధనల విరుద్ధంగా పుత్తూరు మండలంలోని అన్న గౌరి మెడికల్ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేశారని సమాచారం.

పంటలపై ఆగని గజదాడులు



కల్లూరు: పులిచెర్ల మండలంలో పంటలపై ఏనుగుల గుంపు దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. కల్లూరులోని అబ్దుల్ యాసిన్‌కు చెందిన ఎకరా టమోటా పంటను ధ్వంసం చేశాయి. నయ్యద్ బాషాకు చెందిన వరినారును తొక్కేశాయి. యుగంధర్‌కు చెందిన 6 మామిడిచెట్లు, 7 కొబ్బరిచెట్లను విరిచేశాయి. కోటపల్లి భాస్కర్ నాయుడు, పెదబ్బనాయుడుకు చెందిన 20 రాతికూసాలను.. బాబునాయుడుకు చెందిన పశుగ్రాసంను ధ్వంసం చేశాయి. అనంతరం ఎర్రచెరువులోని గుంతలను తొక్కేశాయి.

వంగసానివారిపల్లెలో జంట ఏనుగులు

సోమల: సోమల మండలం ఆవులపల్లె పంచాయతీ వంగసానివారిపల్లె సమీపంలో జంట ఏనుగులు తిరుగుతున్నాయి. పంటలను ధ్వంసం చేస్తున్నాయి. టమోటా కోతల సమయంలో తోటను తొక్కేయడంతో నష్ట పోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పంటలు కోల్పోయిన తమకు నష్టపరిహారం అందించాలని సచివాలయంలో వినతిపత్రం అందజేశారు.

ఫ్యాక్టరీల నుంచి టన్నుకు రూ.30 వేలు పొందండి

మామిడి రైతులకు కలెక్టర్ సూచన

చిత్తూరు (సెంట్రల్), జూన్ 24: మామిడి కాయలను ఫ్యాక్టరీలకు తరలించి టన్నుకు రూ.30 వేలు పొందాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ రైతులకు సూచించారు. మామిడి కోతలు ఒక్కసారిగా జరిగినందున తోతాపురి టన్ను ధర రూ.29 వేల నుంచి రూ.24 వేలకు పడిపోవడంపై మామిడి రైతులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన ఆయన జిల్లాలోని పల్ప్ ఇండస్ట్రీస్ యాజమాన్యాలు, వ్యవసాయ, మార్కెటింగ్, ఉద్యాన శాఖాధికారులతో సమీక్షించారు. తోతాపురి టన్నుకు రూ.30 వేలు ఇవ్వాలని స్పష్టంచేశారు. రైతులు కూడా కోసిన కాయలను ర్యాంపులు, మార్కెట్ యార్డుల్లో కాకుండా పరిశ్రమలకు తరలించి లాభపడాలన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు సంబంధిత శాఖల అధికారులు తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఉద్యాన అధికారి మధుసూదన్‌రెడ్డి, మార్కెటింగ్ ఏడీ పరమేశ్వరన్, ఫ్యాక్టరీ యాజమాన్యాలు పాల్గొన్నారు.

ఎనిమిది మండలాల్లో వర్షం

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 24: నైరుతి రుతుపవనాల ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా సోమవారం ఎనిమిది మండలాల్లో తేలికపాటి వర్షపాతం నమోదైంది. మండలాలవారీగా కుప్పం మండలంలో 30.4మి.మీ, పెద్దపంజాణిలో 22.2, సదుంలో 9.2, కార్వేటినగరంలో 5.4, పలమనేరులో 4.8, పుంగనూరులో 3.2, పులిచెర్లలో 3.0, నగరి మండలంలో 2.6 మిమీ వర్షపాతం నమోదయ్యింది.

మంత్రులను కలసిన తెలుగు యువత నాయకుడు దేరంగుల చంద్ర


మంత్రి రామానాయుడుకు సైకిల్ జ్ఞాపిక ఇస్తున్న చంద్ర


మంత్రి సవితకు సైకిల్ జ్ఞాపిక అందిచేస్తున్న నేతలు

తంబళ్లపల్లె జూన్ 24 : రాష్ట్ర నీటి పారుదల శాఖమంత్రి నిమ్మల రామానాయుడు, బీసీ సంక్షేమ శాఖమంత్రి సవిత, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసయాదవ్‌లను రాజంపేట పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షుడు దేరంగుల చంద్ర మర్యాద పూర్వకంగా కలిశారు. సోమవారం అమరావతిలోని వారి క్యాంప కార్యాలయాల్లో టీడీపీ నాయకులు పురుషోత్తంతో పాటు రాణా ప్రతాప్‌లు మంత్రులను కలసి దుశ్శాలువలు, పూలమాలలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా చంద్ర మంత్రులకు టీడీపీ గుర్తు సైకిల్ జ్ఞాపిక, తిరుమల శ్రీవారి లడ్డు ప్రసాదం అందచేశారు. ఈ సందర్భంగా తంబళ్లపల్లెలో రాజకీయ పరిస్థితులను మంత్రులు అడిగి తెలుసుకున్నట్లు చంద్ర తెలిపారు. తంబళ్లపల్లెలో టీడీపీ బలోపేతానికి కృషి చేయాలని సూచించినట్లు తెలిపారు.

మంత్రి నారా లోకేశ్ ను కలిసిన నేతలు


ఐటీ మంత్రి నారా లోకేశ్‌ను కలసిన టీడీపీ నేత ప్రసాద్

పెద్దమండ్యం, జూన్ 24: రాష్ట్ర ఐటీ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ముఖ్యమంత్రి తనయుడు నారా లోకేశ్‌ను కూటమి నేతలు మర్యాద పూర్వకంగా కలిశారు. సార్వత్రిక ఎన్నికలలో ఎన్‌డీఏ కూటమి ఘన విజయ సాధించిన మంత్రి పదవి చేపట్టిన సందర్భంగా అమరావతి లోని సీఎం క్యాంప్ కార్యాలయంలో సోమవారం మంత్రిని కలిసి పుష్పగుచ్ఛాలు ఇచ్చి దుశ్శాలువలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పెద్దమండ్యం మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు సిద్దవరం ప్రసాద్ నాయకులు దత్తాత్రేయరెడ్డి, పాల్గొన్నారు.

ప్రజల అర్జీలకు తప్పని సరిగా ఆధార్ జతచేయాలి : ఆర్డీవో

మదనపల్లె టౌన్, జూన్ 24: ప్రతి సోమవారం మదనపల్లె సబ్ కలెక్టరేట్, మండలాల్లోని తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజలు వారి అర్జీలకు తప్పని సరిగా ఆధార్‌కార్డు నెంబర్, ఫోన్ నెంబర్లను జత చేయాలని ఆర్డీవో హరిప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ అర్జీలపై ఆధార్‌కార్డు, ఫోన్ నెంబర్లు నమోదు చేయడం వలన ఆన్‌లైన్‌లో ఈ అర్జీలు నమోదు చేస్తామని, అర్జీల స్టేటస్ ఏ ముందో ప్రజలే తెలుసుకోవచ్చన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే ఈ కార్యక్రమానికి సబ్‌కలెక్టరేట్‌లో డివిజన్ స్థాయి అధికారులు, మండలాల్లో అన్ని ప్రభుత్వశాఖల అధికారులు తప్పక పాల్గొనాలని సూచించారు. తొలి రోజున కేవలం 15 మంది అర్జీలుమాత్రామే అందజేశారు.

ప్రజాఫిర్యాదులలో ఎనిమిది అర్జీలు


ప్రజల సమస్యలు వింటున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజ

మదనపల్లె, జూన్ 24: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో ప్రజల నుంచి ఎనిమిది వినతులు, ఫిర్యాదులు వచ్చాయి. మున్సిపల్ చైర్‌పర్సన్ వి.మనూజ, కమిషనర్ కె.ప్రమీల అధ్యక్షతన ఉదయం 10:30గంటల నుంచి 11:30గంటల వరకు జరిగిన ఈ కార్యక్రమంలో సామాజిక, వ్యక్తిగత అంశాలు ఉన్నాయి. ముఖ్యంగా తాగునీటి సరఫరా, వీధిలైట్లు, రోడ్లు, కాలువల మరమ్మతులతోపాటు కొత్తగా నిర్మించాలని సూచించారు. వాటిపై వెంటనే చర్యలు తీసుకోవాలని చైర్‌పర్సన్, కమిషనర్‌లు సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

మదనపల్లె అర్బన్, జూన్24: స్థానిక నీరుగట్టువారిపల్లెలోని గౌతమ్ స్కూల్ 37వ వార్షికోత్సవం వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ముఖ్యఅతిథిగా పాల్గొని కేక్‌కట్ చేసిస్కూల్ కరస్పాండెంట్ లక్ష్మీనారాయణకు తినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ చదివిన విద్యార్థులు ఉన్నత స్థాయిలో స్థిరపడ్డారని తెలిపారు. కార్యక్రమంలో డీవైఈవో శ్రీరాం పురుషోత్తం, ఎంఈవోలు ప్రభాకర్‌రెడ్డి, రాజగోపాల్ తొగట వీర క్షత్రియ సంఘం పట్టణ అధ్యక్షుడు ఉప్పురామచంద్ర, బీజేపీ వెంకటేష్, ప్రసన్న అంజనేయస్వామి ఆలయ చైర్మన్ పురాణం వెంకటరత్నం, పురాణం చంద్రశేఖర్, టీడీపీ నాయకులు కృష్ణ, మోడెం సిద్దప్ప, అంజనేయులు, పురుషోత్తం, పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృత్యువాత

బి.కొత్తకోట, జూన్24: బతుకుదెరువు లో భాగంగా చేపల వేటకు వెళ్లి స.నాగరాజు(50) అనే వ్యక్తి మృత్యువాత పడ్డాడు. బి.కొత్తకోట సీఐ సూర్యనారాయణ కథనం మేరకు పీటీఎం మండలం ఉప్పరోళ్లపల్లెకు చెందిన ఎస్.నాగరాజు బి.కొత్తకోట పరిధిలోని ఆలేటిపల్లెలో ఉంటూ, చేపలు పట్టుకొని జీవనం సాగిస్తూ ఉండే వాడు. యథా ప్రకారం శనివారం రాత్రి చేపలవేటకు వెళ్లి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు అతను చేపలు అమ్మడానికి బయటకి వెళ్లి ఉంటాడని భావించారు. కాగా సోమవారం ఉదయం ఆలేటివాగులో నాగరాజు శవమై తేలడంతో పోలీసుల కు సమాచారం అందించారు. సీఐ తమ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకొని మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెగ్యులర్ ఎస్ఐని నియమించండి

పెద్దమండ్యం, జూన్ 24: పెద్దమండ్యం మండలానికి రెగ్యులర్ ఎస్ఐని వెంటనే నియమించాలని ప్రజలు కోరుతున్నారు. పెద్దమండ్యం ఎస్ఐ చెన్నకేశవ సెలవులో వెళ్లారు. మదనపల్లి ఎస్ఐ రవికుమార్‌కు ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆయన స్థానంలో గత వారం రాయచోటి ఎస్ఐ చలపతి ఇన్‌చార్జ్ ఎస్ఐగా కొనసాగుతున్నారు. సమస్యలతో పోలీ సుస్టేషన్‌కు వచ్చిన ప్రజలకు రెగ్యులర్ ఎస్ఐ లేక ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో జూదర్ల ఆటలు హద్దు అదుపు లేకుండా పోయిందని విమర్శలున్నాయి. రెండు రోజుల క్రితం పాపేపల్లి గ్రామ పంచాయతీలో జూదర్ల స్థావరం పై పోలీసులు దాడులు చేసి 8 మంది జూదర్ల ను అరెస్టు చేసి రూ. 1,01560 నగదు స్వాధీనం చేసుకున్నారు. ప్రజా సమస్యలు పరిష్కారానికి వెంటనే రెగ్యులర్ ఎస్ఐని నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

తాగునీటి సమస్య లేకుండా చూడాలి

- అధికారుల సమీక్షలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా


మదనపల్లె మండలంలో తాగునీటి సమస్యపై అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, జూన్ 24: మదనపల్లె మండలంలో పలు గ్రామాల్లో తాగునీటి సమస్య ఉందని వాటికి తాత్కాలికం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ ఇరెడ్డెమ్మ అధ్యక్షతన అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని కోళ్లబైలు, అంకిశెట్టిపల్లె, బొమ్మనచెరువు, మాలేపాడు, తట్టివారిపల్లె, సీటీఎం-2, కొత్తఇండ్లు, ఈశ్వరమ్మకాలని, కొత్తపల్లె గ్రామ పంచాయతీల్లో తాగునీటి సమస్య ఎక్కువగా ఉందని ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నామని చెప్పగా, ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేశారు. తాగునీటి సమస్య ఉన్న గ్రామాల్లో శాశ్వత పరిష్కారంగా కొత్త బోర్లు వేయించి కొత్త మోటార్లు, పైప్‌లైన్ బిగించాలని ఆదేశించారు. మండల పరిషత్‌లో మూడు మోటార్లు రిజర్వులో ఉండాలని సూచించారు. సీటీఎం-2(క్రాస్‌రోడ్డు) గ్రామ పంచాయతీలో 300 ఇళ్ల స్థలాలను అనర్హులకు కేటాయించారని స్థానికులు ఆధారాలతో సహా ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి విచారించాలని ఎమ్మెల్యే తహసీల్దార్‌ను ఆదేశించారు. అంతే కాకుండా ఇళ్ల పట్టాలు తీసుకుని ఆరు నెలలుగా ఇళ్ల నిర్మాణం చేపట్టని వారికి నోటీసులు ఇచ్చి, అక్రమాలను గుర్తించాలన్నారు. కోళ్లబైలు, సీటీఎం-2 గ్రామ పంచాయతీల్లో ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురయ్యాయని వాటిని స్వాధీనం చేసుకోవాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు ప్రతి రోజు ఆయా పంచాయతీ సచివాలయాలను, ఏదేని ఒక గ్రామాన్ని తప్పని సరిగా పరిశీలించాలన్నారు. ఓవర్‌హెడ్ ట్యాంకులు ప్రతి మూడు నెలలకు ఒకసారి శుభ్రం చేయించి బ్లీచింగ్ వేయించాలన్నారు. చిప్పిలి సమ్మర్‌స్టోరేజి ట్యాంకు నుంచి చాలా మంది ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారని, అలాంటి వాహనాలను సీజ్ చేసి, పీడీ యాక్టుకు సిఫారసు చేయాలన్నారు. మండలంలో కొత్తగా ఏర్పడిన 9 గ్రామ పంచాయతీ కార్యదర్శులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా సర్పంచ్‌లు నగదు విత్‌డ్రా చేస్తున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. దీనిపై డీపీవోతో మాట్లాడి సర్పంచ్‌లు, సెక్రటరిలకు జాయింట్ చెక్‌పవర్ వచ్చేలా చర్యలు చేపడతామన్నారు. కాగా తొలిసారి ఎమ్మెల్యేగా ఎంపీడీవో కార్యాలయానికి వచ్చిన షాజహాన్‌బాషాకు ఎంపీపీ రెడ్డెమ్మ, ఎంపీడీవో భానుప్రసాద్ శాలువ కప్పి, పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. ఈ సమావేశంలో తహసీల్దార్ రమాదేవి, ఏపీఎం సురేష్‌రెడ్డి, ఏపీవో సుబ్రమణ్యం, ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్ ఏఈలు చందన, రమణ, సీడీపీవో సుజాత, వన్‌టౌన్ ఎస్ఐ హరిహరప్రసాద్, చీకిలబైలు సర్పంచ్ ప్రభాకర్, కొత్తపల్లె ఎంపీటీసీ దేవేంద్ర, సీటీఎం మాజీ సర్పంచ్‌లు ప్రభాకర్‌రెడ్డి, రెడ్డిరామ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కోళ్లబైలులో నీటి సమస్య పరిష్కరించాలి


ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు, కోళ్లబైలు కాలనీ ప్రజలు

మదనపల్లె టౌన్, జూన్ 24: మదనపల్లె మండలం కోళ్లబైలు పంచాయతీ వైఎస్‌ఆర్ కాలనీలో తాగునీటి సమస్య పరిష్కరించాలని కాలనీవాసులు ధర్నా నిర్వహించారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట సీపీఐ నాయకుడు కృష్ణప్ప ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ప్రజలు మాట్లాడుతూ తమ కాలనీలో 200 ఇళ్లు ఉన్నాయన్నారు. ఇక్కడ ఆరు నెలలుగా తాగునీటి సమస్య ఉందని అధికారులు, పాలకుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కరించలేదన్నారు. గత్యంతరం లేక ధర్నా చేయాల్సి వచ్చిందన్నారు. అంతే కాక వీధిదీపాలు లేవని, మురుగుకాలువలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీడీవో భానుప్రసాద్ ఆందోళనకారులతో చర్చించి యుద్ధప్రాదిపతికన తాగునీటి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

విద్యార్థులకు విద్యాసామగ్రి వితరణ



కురబలకోట, జూన్ 24: మండలంలోని అంగళ్లు పంచాయతీ మొలకవారిపల్లె ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు విద్యాసామగ్రి వితరణ చేశారు. కనసానివారిపల్లె పంచాయతీ గుణకుంట్లవారిపల్లెకు చెందిన లక్ష్మీదేవి భర్త రెండేళ్ల క్రితం మృతి చెందాడు. కాగా అతని జ్ఞాపకార్థం సుమారు 55మంది విద్యార్థులకు రూ.5వేలు విలువచేసే పెన్నులు, పెన్సిల్‌లు, పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఖాతాదారుడి ప్రమేయం లేకుండానే రూ.1.80 లక్షలు గల్లంతు

పీలేరు, జూన్ 24: పీలేరు మండలానికి చెందిన ఒక బ్యాంకు ఖాతాదారుడి ప్రమేయం లేకుండానే అతడి ఖాతా నుంచి రూ.1.80 లక్షలు గల్లంతైన సంఘటన వెలుగులోకి వచ్చింది. బాధితుడు చెప్పిన వివరాల ప్రకారం.. తిరుపతి రోడ్డు మార్గంలోని చౌడేశ్వరి నగర్‌లో నివాసమున్న జాతీయ చేనేత ఐక్య వేదిక రాష్ట్ర కోశాధికారి సిబ్యాల రమేష్ స్థానిక బ్యాంక్ ఆఫ్ బరోడాలోని తన ఖాతా నుంచే ఎక్కువ లావాదేవీలు నడిపేవాడు. గత బుధవారం తన సెల్‌ఫోనులోని సిమ్ పనిచేయకపోవడంతో మరమ్మతుకిచ్చాడు. శనివారం పాత నెంబరుతోనే కొత్త సిమ్ మార్చుకున్నాడు. ఇది సోమవారం యాక్టివేట్ అయింది. ఆ వెంటనే తన ఖాతాలో నుంచి రూ.లక్షా 80 వేలు వరుసగా డ్రా చేసినట్లు మెసేజీలు వచ్చాయి. ఆది, సోమవారాల్లో ఖాతాలో నుంచి పలు విడతలుగా నగదు తీసినట్లు బ్యాంకు స్టేట్‌మెంట్‌లో ఉందని చెప్పారు. ఆ వెంటనే ఈ విషయాన్ని బీవోబీ మేనేజరుకు ఫిర్యాదు చేయడంతో సైబర్ క్రైమ్‌లో ఫిర్యాదు చేయాల్సిందిగా సూచించారు. దీంతో ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశాడు. కాగా తనకు ఎలాంటి ఓటీపీలుగానీ, లింకులుగానీ రాలేదని రమేష్ చెప్పాడు. తన కుమారుడి పెళ్లి కోసమని రూ.6 లక్షలు అప్పు చేశానని, అందులో రూ.1.80 మాయం కావడంతో తనకు దిక్కుతోచడం లేదని వాపోయాడు. సైబర్ క్రైమ్ పోలీసులు, బ్యాంకు అధికారులు తనకు న్యాయం చేయాలని కోరుతున్నాడు.

ముస్లిం షాదీమహల్‌కు గ్రహణం వీడేనా?

- నిర్లక్ష్యం నీడన రూ.50లక్షల నూతనభవనం


కంపచెట్ల మధ్య నిరుపయోగంగా ఉన్న షాదీమహల్

బి.కొత్తకోట, జూన్24: బి.కొత్తకోటలో ముస్లిం మైనారిటీల సౌకర్యార్థం నిర్మించిన షాదీమహల్ కు పట్టిన గ్రహణం ఇప్పటికైనా వీడేనా? అన్న ప్రశ్న చర్చనీయాంశమైంది. గత ప్రభుత్వం ఈ భవనంపై శీతకన్ను వేయడంతో వినియోగంలోకి రాకుండా పోయింది. ఇప్పుడు ప్రభుత్వం మారింది కాబట్టి అన్నింటిలాగే ఈ షాదీమహల్ కు కూడా మంచి రోజులు వస్తాయేమోనని అందరూ ఆసక్తి కనపరుస్తున్నారు.

రూ.50 లక్షలతో నిర్మాణం

బి.కొత్తకోట పట్టణంలో సుమారు 15వేల ముస్లిం మైనారిటీ జనాభా ఉంది. వారి వివాహాది శుభకార్యాలు నిర్వహించడం కోసం బీరంగి రోడ్డు లో చిన్నపాటి కమ్యూనిటీ హాలు ఉండేది. ముస్లింల అభ్యర్థన మేరకు 2018లో అప్పటి టీడీపీ ఎమ్మెల్యే శంకర్‌యాదవ్ రూ.50 లక్షలు మం జూరు చేయించి పీటీయం రోడ్డులో నూతన షాదీమహల్ నిర్మించారు. నిర్మాణమైతే పూర్తయిందికానీ మౌలిక వసతులు పూర్తి కాలేదు. 2019లో వైసీపీ ప్రభుత్వం రావడం టీడీపీ హయాంలో నిర్మించిన షాదీమహల్ కాబట్టి నిర్లక్ష్యం చేశారని విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో ఎంపీ ల్యాడ్స్ నిధులు రూ.6 లక్షలు మంజూరు చేశారు. భవనానికి విద్యుత్, నీటిసౌకర్యం, మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాలని భావించారు. నిధులైతే విడుదలయ్యాయి కానీ పనులు చేపట్టలేదు. ఏళ్ల తరబడి భవనం వినియోగం లోకి రాకపోవడంతో క్రమంగా శిథిలావస్థకు చేరసాగింది.

కొద్దిరోజుల్లో స్పష్టత వస్తుంది..

షాదీమహల్ కు మంజూరైన ఎంపీ ల్యాడ్స్ నిధులను వినియోగించకపోవడం వాస్తవమే. నాన్‌స్టార్టెడ్ లిస్ట్‌లో అయితే చూపించాం కానీ వర్క్ క్యాన్సిల్ కాలేదు. నిధులు ఏమయ్యాయి అనే విషయమై కొద్దిరోజులలో సమాచారం వస్తుంది. ప్రభుత్వం అదనపు నిధులు మంజూరు చేసినా పనులు పూర్తి చేయచ్చు

- విజయమోహన్ డీఈ, పంచాయతీరాజ్

యోగభోగేశ్వరుడికి ప్రత్యేక పూజలు


ప్రత్యేకాలంకరణలో నీలకంఠేశ్వరుడు


మదనపల్లె అర్బన్, జూన్ 24: మండలంలోని చిప్పిలి గ్రామంలోని మడికయ్యల శివాలయంలో యోగభోగేశ్వరుడికి సోమవారం ఈవో రమణ ఆధ్వర్యంలో ప్రధాన అర్చకుడు విశ్వేశ్వరప్రసాద్ రుద్రాభిషకం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. నీరుగట్టువారిపల్లెలోని నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో శివుడికి జ్యేష్ఠ బహుళ తదియను పురస్కరించుకుని విశేషంగా పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త గుడి రామాంజులు ఆధ్వర్యంలో అర్చకులు స్వామికి రుద్రాభిషేకం నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులకు మధ్యాహ్నం అన్నదానం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

డబుల్ రోడ్డుకు ప్రతిపాదనలు సిద్ధం చేయండి


సమావేశంలో మాట్లాడున్న ఎమ్మెల్యే షాజహన్‌బాషా

నిమ్మనపల్లి, జూన్ 24: మదనపల్లి- కందూరు డబుల్ రోడ్డుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో పని చేసినప్పుడే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందన్నారు. పంచాయతీల బాధ్యత పూర్తిగా కార్యదర్శులదేనని అన్నారు. మండలంలో అనేక సమస్యలు ఉన్నాయని వాటిని గుర్తించి వెంటనే పరిష్కార దిశగా అధికారులు పనిచేయాలన్నారు. అధికారులు సమయపాలన పాటించాలని లేని పక్షంలో బాధ్యతల నుంచి తప్పుకోవాలని ఎమ్మెల్యే ఈ సందర్భంగా హెచ్చరించారు. పనులు సక్రమంగా చేయని అధికారులను తప్పించడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

బాలికల చదువు..దేశ భవితకు వెలుగు


బాలికల చదువు సంతకాల సేకరణ బ్యానర్‌పై సంతకం చేస్తున్న ఆర్డీవో హరిప్రసాద్

మదనపల్లె టౌన్, జూన్ 24: బాలికల చదువు..దేశ భవితకు వెలుగు అవుతుందని ఆర్డీవో హరిప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం పోర్డు సంస్థ, సీఆర్‌వై సంస్థ సంయుక్తంగా ఏడు వారాల పాటు నిర్వహించనున్న బాలికల చదువు కార్యక్రమం సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా ఆర్డీవో హరిప్రసాద్ సంతకం చేశారు. ఆయన మాట్లాడుతూ చాలా చోట్ల పదో తరగతికే బాలికలను చదువు నిలిపివేస్తున్నారని, దీంతో వారికి మహిళా చట్టాలపై అవగాహన లేకుండా పోతోందన్నారు. బాలికలు ఉన్నత చదువులతో భవిష్యత్ స్థిరపడవచ్చన్నారు. పోర్డు సంస్థ డైరెక్టర్ లలితమ్మ మాట్లాడుతూ అంబేడ్కర్ కోనసీమ, కృష్ణ, అన్నమయ్య, తిరుపతి జిల్లాల్లో సంతకాల సేకరణ కార్యక్రమం ప్రారంభమైందన్నారు. ఏడు వారాల పాటు వివిధ రంగాలకు చెందిన మేధావులు, ప్రజల సంతకాలు సేకరించి ప్రధానమంత్రి నరేంద్రమోదీ కార్యాలయానికి పంపుతామన్నారు. ఈ కార్యక్రమంలో పోర్డు సిబ్బంది నరసింహులు, రాధమ్మ, లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

డయేరియాపై అప్రమత్తంగా ఉండండి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో బ్రహ్మానందరెడ్డి

మదనపల్లె టౌన్, జూన్ 24: రాష్ట్రంలో విజృంభిస్తున్న డయేరియా వ్యాధిపై వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సూచించారని ఆర్‌ఎంవో ప్రసాదరాజు పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం రాష్ట్రంలోని అన్ని జిల్లాల డీఎంహెచ్‌వోలు, డీసీహెచ్‌లతో మంత్రి సత్యకుమార్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సర్వజన బోధనాసుపత్రిలో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్‌ఎంవో ప్రసాదరాజు, డాక్టర్ విష్ణువర్ధన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్‌ఎంవో మాట్లాడుతూ సర్వజన బోధనాసుపత్రిలో ఎన్ని బెడ్లు సిద్ధంగా ఉన్నాయని, స్టాప్ డయేరియా క్యాంపైన్ నిర్వహణపై, సీజనల్ వ్యాధుల నివారణపై ముందస్తు చర్యలు తీసుకోవడంలో సూచనలిచ్చారన్నారు.

పెద్దతిప్పసముద్రంలో: మండలంలో డయేరియా (అతిసార) కేసులు రాకుండా పగడ్బందీ చర్యలు చేపట్టాలని మండల వైద్యాధికారి పురుషోత్తం నాయక్, మండల అభివృద్ధి అధికారి బ్రహ్మానందరెడ్డిలు వైద్య సిబ్బందిని ఆదేశించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లకు ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వం వచ్చే నెల 1 నుంచి ఆగస్టు 31 వరకు రాష్ట్ర వ్యాప్తంగా డయేరియా నియంత్రణపై ప్రతి గ్రామంలోను విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో తాగునీటి వనరులలో నీటి నాణ్యతపరీక్షలు నిర్వహించి ఆ మేరకు చర్యలు చేపట్టాలన్నారు. అలాగే ఆయా గ్రామాల్లో ఉన్న మంచి నీటి ట్యాంకులను వారా నికి ఒక్కసారి శుభ్రం చేసి క్లోరినేషన్ చేయాలన్నారు. డయేరియాపై ఆయా గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో గోస్‌పీర్‌తో పాటు మండల స్థాయి అధికారులు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అంటు వ్యాధులు ప్రబలకుండా చూడాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో పోలప్ప

ములకలచెరువు, జూన్ 24: వర్షాకాలం కావడంతో గ్రామాల్లో ఎక్కడా అంటు వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని ఎంపీడీవో పోలప్ప ఆదేశించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాయంలో సోమవారం ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆర్‌డబ్ల్యూఎస్, వైద్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ గ్రామాల్లో వర్షపు నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మురుగునీటి కాలువలు శుభ్రం చేయాలన్నారు. తాగునీటి సరఫరా పైప్‌లైన్‌లు లీకేజీ లేకుండా అరికట్టాలన్నారు. దోమల నివారణకు ఎప్పటికప్పుడు ఫాగింగ్ చేయాలన్నారు. ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బాలానందచారి తదితరులు పాల్గొన్నారు.

ఐదు సంతకాలకు కేబినెట్ ఆమోదం అనందదాయకం

- టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా


ములకలచెరువులో సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా

ములకలచెరువు, జూన్ 24: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సారథ్యంలో ఐదు సంతకాలకు కేబినెట్ ఆమోదం ఆనందదాయకమని టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా పేర్కొన్నారు. మండలంలోని పెద్దపాళ్యంలో సోమవారం తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డి ఆదేశాలతో నాయకులు, కార్యకర్తలతో కలిసి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌ల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పాలగిరి సిద్ధా మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా విధులు చేపట్టిన మొదటి రోజే ప్రజల కోసం ఐదు సంతకాలు చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. చంద్రబాబు సంతకాలు చేసిన మెగా డీఎస్సీ, ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దు, అన్నా క్యాంటీన్ల పునరుద్ధరణ, సామాజిక పింఛన్ల పెంపు, స్కిల్ సెన్సెస్‌లను కేబినెట్ సమావేశంలో ఆమోదించడం శుభపరిణామమన్నారు. సమావేశంలో టీడీపీ నేత కేశవులు, మండల ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి, గ్రామ కమిటీ అధ్యక్షుడు ఆది, మాజీ సర్పంచ్ రమణ, నాయకులు రమణమూర్తి, శ్రీనివాసులు, రెడ్డెప్ప, గంగాద్రి, గణేష్, భజంత్రి రామాంజులు, నాగేంద్ర, శివన్న, మధు, ప్రతాప్‌నాయుడు, భాస్కర్‌నాయుడు, కిరణ్, రవి, శివ పాల్గొన్నారు. కాగా మండలంలోని బురకాయలకోటలో సోమవారం ముఖ్యమంత్రి నారా చంద్రబదబునాయుడు చిత్రపటానికి బీసీ సంఘాల నేతలు, నాయకులు క్షీరాభిషేకం చేశారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా చంద్రబాబు బీసీలకు తొమ్మిది మంత్రి పదవులు కేటాయించి స్పీకర్‌గా అయ్యన్న పాత్రుడు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పల్లా శ్రీనివాసులుకు అవకాశం కల్పించారని సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, రాజంపేట పార్లమెంటు విభాగం బీసీ సెల్ అధికార ప్రతినిధి మత్తుకూరు మౌళి, రాష్ట్ర పాల ఏకిరి సాధికార సమితి సభ్యులు జేసీటీ సుధాకర్‌నాయుడు, యూనిట్ ఇన్‌చార్జి రామకృష్ణమరాజు, నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షుడు విజయ్‌కుమార్, మాజీ సర్పంచ్ బంక నరసింహులు, నాయకులు మురళీధర్‌రావు, గోపాల్‌రాజు, చాంద్‌బాషా, బుర్రా రమణ, బంగారు బాబు, వలిసాబ్ తదితరులు పాల్గొన్నారు.

సీఆర్పీల ఎంపికకు రాత పరీక్ష


రాత పరీక్ష పరిశీలిస్తున్న ఏపీఎం గంగాధర్

తంబళ్లపల్లె జూన్ 24 : స్థానిక స్త్రీశక్తి భవన్‌లో సీఆర్పీల ఎంపికకు సోమవారం రాత పరీక్ష నిర్వహించారు. ఎస్‌ఆర్‌ఎల్‌ఎం, సెర్ప్‌ల ఆధ్వర్యంలో వ్యవసాయేతర, జీవనోపాదులు ఉప పథకాలు అమలుకు సీఆర్పీలను ఎంపిక చేస్తున్నట్లు డీపీఎం రుతు తెలిపారు. నియోజకవర్గంలోని తంబళ్లపల్లె, పెద్దమండ్యం, మొలకలచెరువు, పెద్దతిప్పసముద్రం, కురబలకోట, బి.కొత్తకోట మండలాల నుంచి 70 మంది రాత పరీక్షకు హాజరైనట్లు తెలిపారు. నాలుగు గ్రామ పంచాయతీలకు కలిపి ఒక సీఆర్పీని ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. రాత పరీక్షల్లో అర్హత సాధించిన వారిని ఎంపిక చేసి పథకాల అమలుకు శ్రీకారం చుట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏపీఎం గంగాధర్, సీసీలు పాల్గొన్నారు.

ఏపీ స్టూడెంట్ జేఏసీ జిల్లా అధ్యక్షుడుగా గంగరాజు

మదనపల్లె టౌన్, జూన్ 24: ఏపీ స్టూడెంట్ జేఏసీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడుగా గంగరాజును నియమించినట్లు ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు హేమాద్రియాదవ్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక విశ్వహిత డిగ్రీ కళాశాల వద్ద ఏపీ స్టూడెంట్స్ జేఏసీ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ఉత్తన్న, నరసింహులు, శ్రీధర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం..

బి.కొత్తకోట, జూన్24: బి.కొత్తకోట మండల సర్వసభ్య సమావేశం సోమవారం సాదాసీదాగా జరిగింది. యథా ప్రకారం ప్రజా సమస్యలపై ఎలాంటి వాద ప్రతివాదనలు లేకుండా సమావేశం మమ అనిపించారు. ప్రారంభంలో ఎంపీడీవో నూర్జహాన్ మాట్లాడుతూ ప్రభుత్వం మారినందున పరిపాలనా విధానంలోనూ మార్పులు రానున్నాయని వివరించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సభ్యులు కృషి చేయాలని ఎంపీపీ లక్ష్మీనరసమ్మ పేర్కొన్నారు. హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఈజీఎస్, పంచాయతీరాజ్, వైద్య, ఐసీడీఎస్ తదితర శాఖల అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలను సభకు వివరించారు. సమావేశంలో జడ్పీటీసీ రామచంద్ర, సింగిల్‌విండో అధ్యక్షుడు అమరనాథ్, మండల పరిధిలోని సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

కారు సహా కర్ణాటక మద్యం పట్టివేత.. వ్యక్తి అరెస్ట్

పెద్దతిప్పసముద్రం జూన్ 24 : కారుతో సహా కర్ణాటక మద్యాన్ని తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు . ములకలచెరువు సీఐ మధు, పీటీఎం ఎస్ఐ రహీంద్రబాబు తెలిపారు. పీటీఎంకు చెందిన సోడా షాపు నిర్వాహకుడు అఫ్జల్ అనే వ్యక్తి కర్ణాటక మద్యాన్ని కర్ణాటక నుంచి అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం అందుకున్న ఎస్ఐ తమ సిబ్బందితో దాడులు నిర్వహించగా కారులో మద్యాన్ని తీసుకొచ్చి ఖద్ర పరుస్తుండగా అతనిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఈ దాడిలో అతని వద్ద నుంచి కర్ణాటక మద్యం 10 కేసుల టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని కారుతో సహా అతనిని స్టేషన్‌కు తరలించి అతనిపై సోమవారం కేసు నమోదు చేసి రిమాండుకు పంపుతున్నట్లు పేర్కొన్నారు.స్వాధీనం చేసుకున్న మద్యం విలువ సుమారు రూ. 36వేలు ఉంటుందని ఎస్ఐ పేర్కొన్నారు.